# ప్రజా వాయిస్

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 01 | సంచిక: 273 | ఎడిటర్: మేనం శ్యామ్ | బుధవారం 15-04-2026 | పేజీలు: 6


## సిరా చుక్క

పాలకులు మారుతున్నారు..
రంగులు మారుతున్నాయి.. కానీ...
స్తంభం ఎక్కిన ఆర్టిజన్ బ్రతుకు మాత్రం
మారడం లేదు!
వోల్టేజీ పెరిగితే వైర్లు కాలుతాయి..
మా ఓపిక నశిస్తే మీ గద్దెలు
కూలుతాయి...
మా శ్రమను దోచుకుంటూ మీరు కట్టే
రాజభవనాల పునాదుల్లోమమ్మల్ని
సజీవ సమాధి చేయాలని
చూస్తున్నారా...ఏదీ మీ మేనిఫెస్టో?
ఏదీ మీ నైతికత ఓట్ల కోసం మా
గుడిసెలకు వచ్చి మొక్కినప్పుడు లేని
'నిబంధనలు'రెగ్యులరైజేషన్ అడిగితే
టెక్నికల్ అడ్డంకులంటూ అబద్ధాలు
చెబుతారా...అర్ధరాత్రి వర్షంలో,
ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని
లైన్లు సరిచేసే మా శ్రమమీ కళ్లకు
అగౌరవంగా కనిపిస్తోందా....
కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే
మీ వ్యవస్థకు కార్మికుడి కడుపు మంట
వినిపించడం లేదా చావులతో
వ్యాపారం చేసే చవకబారు
రాజకీయం...
ఒక ఆర్టిజన్ స్తంభం మీద
వేలాడుతుంటే..అది టెక్నికల్ ఫాల్ట్
అంటారాలేక మీ నిర్లక్ష్యపు హత్య
అంటారా..ఎన్నాళ్ళీ కాంట్రాక్టు
ముసుగులో బానిసత్వం...ఎన్నాళ్ళీ
కమిషన్ల కక్కుర్తిలో మా బ్రతుకుల
బలిదానం...మేము కేవలం కరెంటు
తీగలను కలిపేవాళ్లం కాదు
అన్యాయాన్ని నిలదీసే విస్ఫోటనం
కాగల శక్తివంతులం.....
ఇది విజ్ఞప్తి కాదు ఇది తిరుగుబాటు
మా హక్కుల మీద మీరు రాసిన చీకటి
అధ్యాయాన్నన్ని మా పోరాటంతో
తిరగరాస్తాం....
మర్యాదగా మా డిమాండ్లు
నెరవేరుస్తార... లేక రాష్ట్రం మొత్తం
బ్లాక్ అవుట్' చూస్తారా
తేల్చుకోవాల్సింది మీరే...

వారే వేణుగోపాల్.. పాపన్నపేట..
మెదక్ జిల్లా

# పశ్చిమ ఆసియా ఉద్రిక్తతలపై

# మోడీ-ట్రంప్ భారీ చర్చ!

- 40 నిమిషాల పాటు సాగిన ఫోన్ కాల్
- హోర్ముజ్ జలసంధి భద్రతపై ఆందోళన
- ఇరాన్‌పై అమెరికా దిగ్బంధం వేళ భారత్‌కు వెసులుబాటు కోరిన ప్రధాని?



**న్యూఢిల్లీ, ప్రజా వాయిస్:** ప్రపంచ దేశాలను వణికిస్తున్న అమెరికా-ఇరాన్ యుద్ధ మేఘాల మధ్య భారత ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈరోజు సుదీర్ఘంగా ఫోన్లో చర్చించారు.

సుమారు 40 నిమిషాల పాటు సాగిన ఈ సంభాషణలో పశ్చిమ ఆసియాలోని తాజా పరిస్థితులు, ముఖ్యంగా ప్రపంచ ఇంధన సరఫరాకు కీలకమైన 'హోర్ముజ్ జలసంధి' (Strait of Hormuz) వ్యవహారం ప్రధానంగా చర్చకు వచ్చింది.

నా మిత్రుడు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుండి ఫోన్ కాల్ వచ్చింది. వివిధ రంగాలలో మన ద్వైపాక్షిక సహకారంలో సాధించిన గణనీయమైన పురోగతిని మేము సమీక్షించుకున్నాము. మన సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి మేము కట్టుబడి ఉన్నాము. అలాగే పశ్చిమ ఆసియాలోని పరిస్థితి గురించి చర్చించాము. హోర్ముజ్ జలసంధిని తెరిచి ఉంచడం, సురక్షితంగా ఉంచడం ఎంత ముఖ్యమో ఈ సందర్భంగా నొక్కిచెప్పాము. -నరేంద్ర మోడీ, భారత ప్రధానమంత్రి.

**హోర్ముజ్ జలసంధి దిగ్బంధం: భారత్ విజ్ఞప్తి**


గత కొన్ని రోజులుగా ఇరాన్ ఈ జలసంధిని దిగ్బంధించిన నేపథ్యంలో, పాకిస్థాన్‌లో జరిగిన శాంతి చర్చలు విఫలం కావడంతో అమెరికా ఇప్పుడు కఠిన నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. ఇరాన్ ఓడరేవులపై తామే దిగ్బంధం విధిస్తామని ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో, ఇది భారత్ వంటి దేశాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. గతంలో ఇరాన్ ఈ జలసంధిని మూసివేసినప్పుడు భారత్‌కు కొన్ని వెసులుబాట్లు కల్పించింది.ఇదే తరహా వెసులుబాటును, తమ వాణిజ్య ప్రయోజనాల

మిగతా 2లో

## బీహార్ రాజకీయాల్లో ముగిసిన నితీష్ శకం!

- ముఖ్యమంత్రి పదవికి నితీష్ కుమార్ రాజీనామా
- గవర్నర్‌కు లేఖ సమర్పణ!
- రాజ్యసభకు ఎన్నిక కావడంతో నిర్ణయం
- తదుపరి సీఎంగా సామ్రాట్ చౌదరి?

2 లో



# కోమటిరెడ్డి బ్రదర్స్ ఇద్దరికీ మంత్రి పదవులిస్తే తప్పేంటి?

- డబ్బు లేనిదే రాజకీయం లేదు
- ఒక్కో ఎమ్మెల్యే గెలుపుకు రూ. 100 కోట్లు!
- పీసీసీ చీఫ్‌గా మహేష్ కుమార్ గౌడ్‌కు మా మద్దతు ఉంటుంది




**హైదరాబాద్, ప్రజా వాయిస్:** తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి మరోసారి తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. గాంధీ భవన్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన.. కేబినెట్ విస్తరణ, పార్టీ పదవులు మరియు ప్రస్తుత ఎన్నికల రాజకీయాల్లో ధనప్రవాహంపై కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

**కేబినెట్‌లో ఇద్దరు కోమటిరెడ్డిలకు చోటు!**

మంత్రివర్గ విస్తరణపై చర్చ జరుగుతున్న వేళ, కోమటిరెడ్డి సోదరుల విషయంలో జగ్గారెడ్డి ఆసక్తికర ప్రతిపాదన చేశారు.ప్రస్తుతం మంత్రిగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కొనసాగిస్తూనే, ఆయన సోదరుడు కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డికి కూడా మంత్రి పదవి ఇవ్వాలని ఆయన కోరారు.కోమటిరెడ్డి బ్రదర్స్ ఇద్దరూ కేబినెట్‌లో ఉంటే తప్పేంటి? ఇదే విషయాన్ని నేను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా చెబుతాను అని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.


**డబ్బుంటేనే నాయకత్వం..**

ప్రస్తుత రాజకీయాల్లో డబ్బు ప్రాధాన్యతను జగ్గారెడ్డి బహిరంగంగానే అంగీకరించారు. "ఇప్పుడు డబ్బు లేకుండా రాజకీయం లేదు. ఎవరు ఎక్కువ డబ్బు

మిగతా 2లో

# విదేశీ ఉద్యోగాల పేరుతో కోట్ల దోపిడీ

- ముఠా గుట్టురట్టు!
- ట్రివియల్ చాప్టర్ సంస్థపై జూబ్లీహిల్స్ పోలీసుల ఉక్కుపాదం
- ఇద్దరు కీలక నిందితుల అరెస్ట్..
- సీఈఓ సహా ఎనిమిది మంది పరారీ



హైదరాబాద్, ప్రజా వాయిస్:విదేశాల్లో భారీ జీతంతో కూడిన ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి నిరుద్యోగుల నుంచి కోట్లాది రూపాయలు కొల్లగొట్టిన 'ట్రివియల్ చాప్టర్' (Trivial Chapter) కన్సల్టెన్సీ ముఠా ఆటను జూబ్లీహిల్స్ పోలీసులు కట్టడి చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా సంస్థను నడుపుతూ, నకిలీ ఆఫర్ లెటర్లతో నిరుద్యోగులను నిలువునా ముంచిన ఈ ముఠాలో ఇద్దరిని అరెస్ట్ చేయగా, మరో ఎనిమిది మంది కోసం గాలింపు చేపట్టారు.

**సోషల్ మీడియా యాడ్స్ తో వల**

నిందితులు పక్కా ప్లాన్ ప్రకారం ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో యూరప్ దేశాలైన గ్రీస్, రొమేనియాల్లో ఉద్యోగాలు ఉన్నాయంటూ ఆకర్షణీయమైన ప్రకటనలు ఇచ్చేవారు. ఆ ప్రకటనలు చూసి సంప్రదించిన నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి తమ వలలో వేసుకునేవారు. ఒక్కో అభ్యర్థి నుంచి రూ. 50 వేల నుండి రూ. 4 లక్షల వరకు వసూలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది.

**నకిలీ పత్రాలతో నమ్మించి..**

డబ్బులు వసూలు చేసిన తర్వాత నిందితులు బాధితులకు నకిలీ 'వర్క్ ఆథరైజేషన్ లెటర్స్' అందజేసేవారు. అవి చూసి నిజమైనవేనని నమ్మిన నిరుద్యోగులు మిగిలిన బ్యాలెన్స్ కూడా చెల్లించేవారు. మొత్తం డబ్బు చేతికందిన వెంటనే నిందితులు తమ ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి కార్యాలయాలకు తాళాలు వేసి పరారయ్యేవారు.

**ఇద్దరి అరెస్ట్.. పాత నేరస్తులే!**

బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు ట్రివియల్ చాప్టర్ సౌత్ జోన్ వైస్ ప్రెసిడెంట్ లంక నిరుపమ, తెలంగాణ రీజినల్ మేనేజర్ మామిడి అరుణ్ రాజ్ లను అరెస్ట్ చేశారు.ఈ సంస్థకు విదేశీ రిక్రూట్‌మెంట్‌కు అవసరమైన ఆర్‌ఏ (RA) లైసెన్స్ లేదు.గతంలోనూ కేపీహెచ్‌బీ పీఎస్ పరిధిలో ఈ సంస్థపై కేసులు నమోదయ్యాయి.పట్టుబడకుండా ఉండేందుకు నిందితులు తరచూ ఆఫీసు అడ్రస్, సంస్థ పేరు మారుస్తూ ఈ దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

**అప్రమత్తంగా ఉండాలి: పోలీసులు**

ప్రస్తుతం పరారీలో ఉన్న సంస్థ

మిగతా 2లో



## అమెరికా దిగ్బంధానికి గండి

- హోర్ముజ్‌లో ఇరాన్ నౌకల సవాల్!
- దిగ్బంధం అమల్లోకి వచ్చిన గంటల్లోనే జలసంధి దాటిన రెండు నౌకలు
- చైనా ట్యాంకర్ కూడా సేఫ్ పాసేజ్లో ప్రయాణం
- తలవంచుకున్న అగ్రరాజ్యం

2 లో

# ఆశా భోస్లేకు నివాళి

- పాక్ ఛానెల్‌కు సంజాయిషీ నోటీసు!
- భారతీయ కంటెంట్ ప్రసార నిషేధం ఉల్లంఘించారని PEMRA ఆగ్రహం
- కళకు సరిహద్దులు లేవు జియో న్యూస్ ఎండీ అజహర్ అబ్బాస్ ధీటైన సమాధానం



**ఇస్లామాబాద్, ప్రజా వాయిస్:** ప్రపంచ ప్రఖ్యాత గాయని, 'మెలోడీ క్వీన్' ఆశా భోస్లే మరణవార్తను ప్రసారం చేయడం పాకిస్తాన్‌లోని ప్రముఖ వార్తా సంస్థ 'జియో న్యూస్'కు చిక్కులు తెచ్చిపెట్టింది. ఆమెకు నివాళి అర్పిస్తూ భారతీయ కంటెంట్‌ను ప్రసారం చేసినందుకు గాను పాకిస్తాన్ ఎలక్ట్రానిక్ మీడియా రెగ్యులేటరీ అథారిటీ (PEMRA) ఆ ఛానెల్‌కు నోటీసులు జారీ చేసింది. 2018 నుండి అమలులో ఉన్న భారతీయ కంటెంట్ నిషేధాజ్ఞలను ఈ ప్రసారం ఉల్లంఘించిందని PEMRA ఆరోపించింది.

**నిషేధం ఉల్లంఘించారంటూ అభియోగం**

2026, ఏప్రిల్ 12న ఆశా భోస్లే (92)

మిగతా 2లో

# అడ్డంగా నరుకుతాం

- కాంగ్రెస్ ఎమ్మెల్యే వ్యాఖ్యల దుమారం!
- ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ హెచ్చరికలపై ప్రతిపక్షాల విమర్శలు
- కార్యకర్తలకు ధైర్యం చెప్పేందుకే అలా అన్నారంటూ మంత్రి శ్రీధర్ బాబు క్లారిటీ



**మంథని, ప్రజా వాయిస్:** కాంగ్రెస్ పార్టీకి చెందిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ చేసిన ఘాటు వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం రేపుతున్నాయి. మంథనిలో జరిగిన పార్టీ సమావేశంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలోనే ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి.

**కోర్టు తీర్పునకు లోబడే విద్యార్థుల భవితవ్యం**


అడ్వకేట్ విజయ్ గోపాల్ దాఖలు చేసిన

మిగతా 2లో

## రోడ్డు ప్రమాదమా..? పథకం ప్రకారమే హత్యనా..?

- వాహన తనిఖీల సమయంలో మృతి చెందిన ఏఎస్ఐ గోవింద్
- కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్
- ఏఎస్ఐ కుటుంబానికి పోలీసు శాఖ అండగా ఉంటుంది : జిల్లా ఎస్పీ

2 లో





# జీవన్ రెడ్డిని ఎప్పుడూ తక్కువ చేసి చూడలేదు

- సీఎం రేవంత్ రెడ్డి
- జగిత్యాల కార్యకర్తల ఆత్మగౌరవాన్ని కేసీఆర్‌కు తాకట్టు పెట్టారు
- వ్యక్తి కంటే పార్టీయే ముఖ్యం
- కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా

**హైదరాబాద్, ప్రజా వాయిస్** :సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడటంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలిసారిగా స్పందించారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జగిత్యాల నియోజకవర్గ ముఖ్య నాయకులతో భేటీ అయిన సీఎం, తాజా రాజకీయ పరిణామాలపై సుదీర్ఘంగా చర్చించారు. జీవన్ రెడ్డి గౌరవానికి భంగం కలిగేలా తాము ఎప్పుడూ వ్యవహరించలేదని, ఆయన స్వయంగా తీసుకున్న నిర్ణయం కార్యకర్తలను విస్మయానికి గురిచేసిందని పేర్కొన్నారు.

మిగతా 2లో

# జీవన్ రెడ్డిని ఎప్పుడూ తక్కువ చేసి చూడలేదు

మొదటి పేజీ తరువాయి

**ఆయన కోసం పార్టీ ఎంతో చేసింది**

సమావేశంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, జీవన్ రెడ్డి రాజకీయ భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇచ్చిందని గుర్తుచేశారు.2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన గెలుపు కోసం అందరం శ్రమించాం. పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి పోటీ చేయమన్నా, ఆయన కోరిక మేరకు నిజామాబాద్ టికెట్ ఇచ్చాం.మున్సిపల్ ఎన్నికల్లో కూడా జీవన్ రెడ్డి సూచించిన వారికే టికెట్లు ఇచ్చాం. ఆయన కుటుంబ సభ్యుల రాజకీయ భవిష్యత్తుకు భరోసా ఇచ్చినా వినకుండా మొండిపట్టుతో వెళ్లారు.

**కేసీఆర్‌తో జతకట్టడం బాధాకరం**

40 ఏళ్లుగా తనను నమ్ముకున్న కార్యకర్తలను వదిలి, మాజీ సీఎం కేసీఆర్‌తో జీవన్ రెడ్డి చేతులు కలపడాన్ని రేవంత్ రెడ్డి తీవ్రంగా తప్పుపట్టారు. జీవన్ రెడ్డి లాంటి మేధావి కేసీఆర్ దగ్గర చేతులు కట్టుకుని నిలబడటం అత్యంత బాధాకరం. జగిత్యాల కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మగౌరవాన్ని ఆయన బీఆర్ఎస్‌కు తాకట్టు పెట్టారు. ప్రజా ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూస్తున్న శక్తులతో ఆయన జతకట్టడం ఆయన అనుభవానికి తగదు అని సిఎం రేవంత్ అన్నారు.

# బీహార్ రాజకీయాల్లో ముగిసిన నితీష్ శకం!

**పాట్నా, ప్రజా వాయిస్:** బీహార్ రాజకీయాల్లో సుదీర్ఘ కాలం పాటు తనదైన ముద్ర వేసిన నితీష్ కుమార్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి పదవికి ఆయన ఈరోజు మధ్యాహ్నం గుడ్ బై చెప్పారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అత హస్నైన్ ను కలిసిన నితీష్, తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. మిత్రపక్షం బీజేపీ అగ్రనాయకత్వం సూచనల మేరకు, జాతీయ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించేందుకు ఆయన రాష్ట్ర రాజకీయాల నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు.

**రాజ్యసభ ఎన్నికతో మలుపు**

నితీష్ కుమార్ ఇటీవల రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఈ నెల 10వ తేదీన ఆయన ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంటరీ నిబంధనల ప్రకారం.. రాజ్యసభ సభ్యుడిగా కొనసాగాలంటే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడం తప్పనిసరి. ఈ నేపథ్యంలోనే ఆయన ముఖ్యమంత్రి బాధ్యతల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నారు. జనతాదళ్ (యునైటెడ్) లో ఈ పరిణామం తీవ్ర చర్చనీయాంశమైంది.

**చివరి కేబినెట్ భేటీలో భావోద్వేగం**

రాజీనామా సమర్పించడానికి ముందు నితీష్ కుమార్ తన నివాసంలో చివరిసారిగా కేబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. సుమారు ఆరు నిమిషాల పాటు సహచర మంత్రులతో మాట్లాడిన ఆయన, 2005 నుండి బీహార్ అభివృద్ధి కోసం తాను చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు.2005లో అధికారం చేపట్టినప్పటి నుండి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు నా శక్తి మేరకు పనిచేశాను. రాష్ట్ర రాజకీయాల నుంచి వైదొలుగుతున్నప్పటికీ, నా మనసు ఎప్పుడూ ఇక్కడే ఉంటుంది. ప్రతి కార్యకర్తకు, సామాన్యుడికి నేను అందుబాటులో ఉంటాను అని నితీష్ కుమార్ అన్నారు.

**రంగంలోకి బీజేపీ అగ్రనేతలు**

ఈ పరిణామాల నేపథ్యంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారాయి. రాజీనామాకు ముందు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరిలు నితీష్‌తో భేటీ అయ్యారు. అనంతరం మధ్యాహ్నం 3:15 గంటలకు గవర్నర్‌కు రాజీనామా సమర్పించారు. నితీష్ రాజీనామాను ఆమోదించిన గవర్నర్, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగే వరకు ఆయన్నే ఆపద్ధర్మ సీఎంగా కొనసాగాలని కోరారు.

# పశ్చిమ ఆసియా ఉద్రిక్తతలపై

మొదటి పేజీ తరువాయి

దృష్ట్యా భారత్‌కు కల్పించాలని ప్రధాని మోడీ ట్రంప్‌ను కోరినట్లు సమాచారం.అయితే, ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడు ఎలాంటి హామీ ఇచ్చారనేది ఇంకా అధికారికంగా వెల్లడి కాలేదు.

**ఫోన్ కాల్ తర్వాత ప్రధాని మోడీ ట్వీట్**

ఈ సంభాషణ అనంతరం ప్రధాని మోడీ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు.

**అంతర్జాతీయంగా పెరుగుతున్న ఉత్కంఠ..**

ఇరాన్-అమెరికా మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ప్రకటించిన తర్వాత ఇరువురు నేతలు మాట్లాడుకోవడం ఇదే మొదటిసారి. ఇరాన్‌తో చర్చలు విఫలమవడం, మరోవైపు అమెరికా సైనిక చర్యల దిశగా ఆలోచిస్తుండటం ప్రపంచ మార్కెట్లలో ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో భారత్ అనుసరిస్తున్న దౌత్య నీతి అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. జలసంధి మూతపడితే చమురు ధరలు ఆకాశాన్ని తాకడమే కాకుండా, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# కోమటిరెడ్డి బ్రదర్స్ ఇద్దరికీ మంత్రి పదవులిస్తే తప్పేంటి?

మొదటి పేజీ తరువాయి

పెడితే వాళ్లే నాయకులు అవుతున్నారు. ఒక్కో ఎమ్మెల్యేగా గెలవాలంటే రూ. 100 కోట్లు ఖర్చు అవుతోంది" అని ఆయన పేర్కొనడం చర్చనీయాంశమైంది.

**పీసీసీ పదవిపై క్లారిటీ**

ఇటీవల మంత్రి వెంకట్ రెడ్డి తనను పీసీసీ చీఫ్ చేయాలని అన్నట్లు వస్తున్న వార్తలపై కూడా జగ్గారెడ్డి స్పందించారు. వెంకట్ రెడ్డి గారు ఏదో ఫ్లోలో ఆ మాట అన్నారు. ప్రస్తుతం మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్‌గా కొనసాగుతారు. ఆయన పేరును నేనే ప్రతిపాదించాను. రెడ్లంతా సపోర్ట్ చేయడం వల్లే ఆయన పీసీసీ అధ్యక్షుడయ్యారు. మా మధ్య విభేదాలు సృష్టించొద్దు అని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు.

# ఫాతిమా ఒవైసీ కాలేజీ అడ్మిషన్లపై హైకోర్టు కీలక ఆదేశాలు!

- ఫాతిమా ఒవైసీ కాలేజీ అడ్మిషన్లపై హైకోర్టు కీలక ఆదేశాలు!
- అడ్మిషన్లు మీ సొంత రిస్కే
- తల్లిదండ్రులకు ధర్మాసనం హెచ్చరిక
- విద్యా సంస్థ నోటీసు బోర్డులపై కేసు వివరాలు ఉంచాలని స్పష్టం







**హైదరాబాద్, ప్రజా వాయిస్:** పాతబస్తీలోని సల్కం చెరువు ఎఫ్‌టీఎల్ మరియు బఫర్ జోన్ పరిధిలో అక్రమంగా నిర్మించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న 'బారిస్టర్ ఫాతిమా ఒవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్' భవితవ్యంపై తెలంగాణ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. ఈ విద్యా సంస్థలో తమ పిల్లలను చేర్పించాలనుకునే తల్లిదండ్రులు పూర్తి అవగాహనతో, తమ సొంత బాధ్యతపైనే అడ్మిషన్లు తీసుకోవాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.

**కోర్టు తీర్పునకు లోబడే విద్యార్థుల భవితవ్యం**

అడ్వకేట్ విజయ్ గోపాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ ధర్మాసనం పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ సంస్థపై కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున, తుది తీర్పు వ్యతిరేకంగా వస్తే విద్యార్థులు ఎలాంటి హక్కులు కోరలేరని కోర్టు స్పష్టం చేసింది. విద్యా సంస్థ యాజమాన్యం తమ నోటీసు బోర్డులపై కేసు వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించాలని, తద్వారా అడ్మిషన్ల సమయంలో తల్లిదండ్రులకు పూర్తి సమాచారం తెలియాలని ఆదేశించింది.సల్కం చెరువు పరిధిలో ఇకపై ఎలాంటి అదనపు నిర్మాణాలు చేపట్టవద్దని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

**శాటిలైట్ చిత్రాల్లో అక్రమ కట్టడాలు?**

పిటిషనర్ తరపు వాదనలు విన్న న్యాయమూర్తి, పబ్లిక్ డొమైన్‌లో ఉన్న శాటిలైట్ చిత్రాలను పరిశీలించారు. ప్రాథమికంగా ఈ విద్యా సంస్థ చెరువు మధ్యలో మరియు బఫర్ జోన్‌లో నిర్మించినట్లు కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. ఏఐఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీకి చెందిన 'సలార్-ఎ-మిల్లత్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో ఈ సంస్థ నడుస్తోంది.

**హైడ్రా (HYDRAA) వివరణ ఏంటి?**

గతంలో ఈ విద్యా సంస్థపై చర్యల విషయమై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందిస్తూ.. ఈ కాలేజీలో 10 వేల మందికి పైగా పేద విద్యార్థులు ఉచితంగా విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. సామాజిక కోణంలో ఆలోచించి, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోలేకపోతున్నామని గతంలో వివరణ ఇచ్చారు. అయితే, ఇప్పుడు హైకోర్టు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించడంతో తదుపరి విచారణపై ఉత్కంఠ నెలకొంది.ఈ కేసు తదుపరి విచారణను హైకోర్టు ఏప్రిల్ 30కి వాయిదా వేసింది. జూన్ 1 నుండి ప్రారంభం కానున్న కొత్త విద్యా సంవత్సరంపై కోర్టు ఇచ్చే తుది తీర్పు ప్రభావం చూపే అవకాశం ఉంది.

# ఆశా భోస్లేకు నివాళి

మొదటి పేజీ తరువాయి

కన్నుమూసిన నేపథ్యంలో, జియో న్యూస్ ఆమె సంగీత ప్రస్థానాన్ని గుర్తుచేస్తూ నివాళులు అర్పించింది. అయితే, 2018లో పాక్ సుప్రీంకోర్టు విధించిన ఆదేశాల ప్రకారం భారత్‌కు చెందిన ఎలాంటి కంటెంట్‌ను ప్రసారం చేయకూడదనే నిబంధన ఉంది. PEMRA రూల్స్ 2009, 2012 రెగ్యులేషన్స్ మరియు 2015 కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం జియో న్యూస్ ఉద్దేశపూర్వకంగా చట్టాన్ని ధిక్కరించిందని నోటీసులో పేర్కొన్నారు. ఈ విషయమై ఏప్రిల్ 27న విచారణకు హాజరుకావాలని సీఈఓను ఆదేశించారు.

**కళాకారులకు సరిహద్దులు ఉంటాయా?**

PEMRA నోటీసుపై జియో న్యూస్ మేనేజింగ్ డైరెక్టర్ అజహర్ అబ్బాస్ సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు.కళాకారుల గురించి నివేదించేటప్పుడు వారి సేవలను గుర్తుచేసుకోవడం ఆనవాయితీ. ఆశా భోస్లే వంటి దిగ్గజం మన నూర్ జహాన్‌ను 'పెద్దక్క' అని పిలిచేవారు, నుస్రత్ ఫతే అలీ ఖాన్‌తో కలిసి పనిచేశారు. యుద్ధాలు, రాజకీయ ఘర్షణల సమయంలో కళ, కళాకారులు బాధితులు కాకూడదు అని జియో న్యూస్ ఎండీ అజహర్ అబ్బాస్ అన్నారు.

**ప్రపంచవ్యాప్త విషాదం**

ఆశా భోస్లే మరణం సంగీత ప్రపంచానికి తీరని లోటు. ముంబైలోని శివాజీ పార్కులో ప్రభుత్వ లాంఛనాలతో జరిగిన ఆమె అంత్యక్రియలకు దేశవిదేశాల నుండి ప్రముఖులు హాజరయ్యారు. ఉర్దూ కవిత్వంపై పట్టున్న ఆమె, పాకిస్తానీ కళాకారులతో ఉన్న అనుబంధం కారణంగా అక్కడి ప్రజల్లో కూడా ఎంతో అభిమానాన్ని సంపాదించుకున్నారు. అయితే, తాజా నోటీసు పరిణామం పాకిస్తాన్ మీడియా వర్గాల్లో 'భావ ప్రకటన స్వేచ్ఛ'పై చర్చకు దారితీసింది.



# అంబేద్కర్ ఆశయాల సాధనతోనే సమానత్వ సమాజం సాధ్యం

- తోటకూర వజ్రేష్ యాదవ్
- కీసరలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు
- రాజకీయ పార్టీల ఐక్యతకు వేదికైన కీసర సర్కిల్
- ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**కీసర, ప్రజా వాయిస్:** మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని కీసర మండల కేంద్రంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు కర్రె గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలకు వివిధ రాజకీయ పార్టీల నేతలు హాజరై, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి హాజరయ్యారు.

**అంబేద్కర్ అందరికీ మార్గదర్శి: వజ్రేష్ యాదవ్**

ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. "డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనలు, సిద్ధాంతాలు సమాజంలోని ప్రతి వర్గానికి మార్గదర్శకం. రాజ్యాంగం ద్వారా బడుగు, బలహీన వర్గాలకు సమాన హక్కులు కల్పించిన మహోనీయుడు అంబేద్కర్. ఆయన ఆశయాల సాధనతోనే సమానత్వ సమాజం సాధ్యమవుతుంది" అని పేర్కొన్నారు.


**అంబేద్కర్ గారి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి: ఈటల రాజేందర్.**

ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ గారి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని, ఆయన ఆశయాలకు అనుగుణంగా సమాజ హితం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు.

**ఉత్సాహంగా అంబేద్కర్ ప్రీమియర్ లీగ్ (APL)**

జయంతి వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ ప్రీమియర్ లీగ్ (APL) క్రికెట్ టోర్నమెంట్ యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు నాయకులు బహుమతులు అందజేశారు:
- ప్రథమ బహుమతి: అహ్మద్‌గూడ యువత.
- ద్వితీయ బహుమతి: రాంపల్లి యువత.
- తృతీయ బహుమతి: కుందనపల్లి యువత.

యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల స్థానిక నాయకులు, కార్యకర్తలు, అంబేద్కర్ సంఘం సభ్యులు మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదమా..? పథకం ప్రకారమే హత్యనా..?

ప్రజా వాయిస్, సంగారెడ్డి :మానూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ గోవింద్ వాహన తనిఖీల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం జిల్లాలో కలకలం రేపింది. ఈ ఘటనపై ప్రమాదమా..? లేక పథకం ప్రకారమే జరిగిందా..? అనే అనుమానాలు బలపడుతున్నాయి.ఈ నేపథ్యంలో ఏఎస్ఐ గోవింద్ అంత్యక్రియలకు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ హాజరై మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం గోవింద్ కుటుంబ సభ్యులను పరామర్శించి, అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు.

**కుటుంబ సభ్యులతో మాట్లాడిన జిల్లా ఎస్పీ...**

"జిల్లా పోలీసు శాఖ గోవింద్ కుటుంబానికి అండగా ఉంటుంది. ఆయనకు రావాల్సిన అన్ని రకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటాం" అని హామీ ఇచ్చారు.

**ఎలా జరిగింది..?**

జిల్లా ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం...తేదీ 13-04-2026 రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో ఏఎస్ఐ గోవింద్ పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మానూర్ ఎంఆర్ఓ కార్యాలయం సమీపంలో పాయింట్ బుక్ తనిఖీ చేపట్టారు.అదే సమయంలో పెట్రోలింగ్ వాహనం డ్రైవర్‌గా ఉన్న రామారావు (హోంగార్డ్) పోలీసు బొలేరో వాహనం నంబర్ TS 09 AP 1098 ను అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ఏఎస్ఐ గోవింద్‌ను ఢీకొట్టినట్లు తెలిపారు.తీవ్ర రక్తస్రావ గాయాలైన గోవింద్‌ను వెంటనే చికిత్స కోసం నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు పరిశీలించి ఆయన మృతి చెందినట్లు నిర్ధారించినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్బీ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, ఎస్ఐలు కోటేశ్వర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

**ప్రమాదమా..? కుట్ర కోణమా..? బలపడుతున్న అనుమానాలు**

ఇదిలా ఉండగా... ఈ ఘటనపై స్థానికులు, పోలీసు సిబ్బందిలో తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.మానూర్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న గోవింద్ నిజాయితీగా విధులు నిర్వహిస్తూ అక్రమాలపై కఠినంగా వ్యవహరిస్తున్నారని స్థానికులతో పాటు కొందరు సిబ్బంది కూడా చెబుతున్నారు.అయితే ఆయన నిజాయితీని తట్టుకోలేక కొందరు సిబ్బంది కక్ష పూరితంగా వ్యవహరించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే క్రమంలో గత నెలలో రెండు సార్లు ఏసీబీ దాడుల ప్రయత్నాలు జరిగాయని, కానీ ఆ సమయంలో గోవింద్ తప్పించుకున్నారని సమాచారం.ఈ నేపథ్యంలోనే "ఇది ప్రమాదం కాదు... పథకం ప్రకారం జరిగిన ఘటన" అనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

**వాహన తనిఖీ సమయంలో ఇది ఎలా సాధ్యం..?**

వాహన తనిఖీల సమయంలో సాధారణంగా... రోడ్డుపై వాహనాలను ఆపడం, పత్రాలు పరిశీలించడం హోంగార్డ్ లేదా కానిస్టేబుల్ చేస్తారు. ఆ తరువాత ఏదైనా సందేహం ఉంటే ఏఎస్ఐ వద్దకు తీసుకెళ్లి మాట్లాడుతారు.కానీ ఈ ఘటనలో... ఏఎస్ఐ గోవింద్ అక్కడ ఉన్నారని స్పష్టంగా తెలిసినా, డ్రైవర్ రామారావు వాహనాన్ని అతివేగంగా తీసుకెళ్లి నేరుగా ఆయనపైకి దూసుకెళ్లడం అనుమానాలకు తావిస్తోంది.అంతేకాకుండా ఘటన అనంతరం గాయపడిన ఏఎస్ఐని ఆసుపత్రికి తరలించకుండా, ఏమీ తెలియనట్టు అక్కడి నుంచి పరారైనట్టు సమాచారం ఉండటం మరింత అనుమానాలకు దారితీస్తోంది.

**పంపకాల గొడవలే కారణమా..?**

ఈ ఘటన వెనుక పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న వివిధ కేసుల పంపకాల విషయంలో తలెత్తిన గొడవలు కారణమని స్థానికంగా చర్చ నడుస్తోంది.అధికారులు దీనిని అతివేగంతో జరిగిన ప్రమాదంగా చెబుతున్నప్పటికీ... సిబ్బందిలో నెలకొన్న విభేదాలు, గతంలో జరిగిన ఏసీబీ ప్రయత్నాలు, ఘటన జరిగిన తీరు చూస్తే...ఇది అనుకోకుండా జరిగిన ప్రమాదమా..? లేక కావాలనే చేసిన ప్రమాదమా..? అన్న అనుమానాలు బలపడుతున్నాయి.ఇక ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిజాలు వెలికి తీయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# అమెరికా దిగ్బంధానికి గండి

**వాషింగ్టన్/టెహ్రాన్, ప్రజా వాయిస్:** ఇరాన్ ఓడరేవులను దిగ్బంధించి ఆ దేశ ఆర్థిక మూలాలను దెబ్బతీయాలని భావించిన అమెరికాకు కోలుకోలేని షాక్ తగిలింది. అమెరికా సెంట్రల్ కమాండ్ (CENTCOM) హెచ్చరికలను బేఖాతరు చేస్తూ, కట్టుదిట్టమైన సైనిక నిఘా నీడలోనే రెండు నౌకలు హోర్ముజ్ జలసంధిని విజయవంతంగా దాటాయి. దీంతో అగ్రరాజ్యం ప్రకటించిన 'దిగ్బంధం' వ్యూహం మొదటిరోజే విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**అమెరికా హెచ్చరికలు.. నౌకల ధిక్కారం**

ఇరాన్ ఓడరేవుల నుంచి బయలుదేరే లేదా అక్కడికి చేరుకునే ఏ దేశ నౌకనైనా లక్ష్యంగా చేసుకుంటామని అమెరికా సైన్యం ప్రకటించిన రెండు గంటల వ్యవధిలోనే ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. సముద్రయాన ట్రాకింగ్ సంస్థ 'క్ప్లర్' (Kpler) అందించిన గణాంకాల ప్రకారం లైబీరియా జెండాతో ఉన్న ఈ బల్క్ క్యారియర్, ఇరాన్‌లోని బందర్ ఇమామ్ ఖొమేనీ ఓడరేవులో సరుకు దించిన తర్వాత హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించి లారాక్ ద్వీపాన్ని దాటింది.కొమొరోస్ జెండా కలిగిన ఈ ట్యాంకర్, 31,000 టన్నుల మెథనాల్‌తో ఇరాన్‌లోని బుషెహర్ ఓడరేవు నుంచి బయలుదేరి సురక్షితంగా జలసంధిని దాటింది.

**చైనా ట్యాంకర్ 'వ్యూహాత్మక' ప్రయాణం**

కేవలం ఈ రెండు నౌకలే కాకుండా, 'రిచ్ స్టార్రీ' అనే చైనా ట్యాంకర్ కూడా రాత్రికి రాత్రే ఇరాన్ ఆమోదించిన తనిఖీ మార్గం ద్వారా జలసంధిని దాటినట్లు సమాచారం. 31,500 టన్నుల మిథనాల్‌తో ఇది ఒమన్‌లోని సోహార్‌కు వెళుతోంది. అమెరికా హెచ్చరికల నేపథ్యంలో చైనా నౌకలు ఇలా యథేచ్ఛగా ప్రయాణించడం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

**పరువు పోగొట్టుకున్న ట్రంప్ సర్కార్?**

పాకిస్థాన్‌తో జరిగిన శాంతి చర్చలు విఫలమయ్యాక, హోర్ముజ్ జలసంధిపై పట్టు సాధిస్తామని ప్రగల్భాలు పలికిన ట్రంప్ యంత్రాంగానికి ఇది గట్టి ఎదురుదెబ్బ. అమెరికా యుద్ధ నౌకల నిఘా కళ్లను కప్పి నౌకలు ప్రయాణించడం, అగ్రరాజ్య సైనిక శక్తి సామర్థ్యాలపై ప్రశ్నలను రేకెత్తిస్తోంది. ఈ పరిణామం ఇరాన్ ధైర్యాన్ని పెంచడమే కాకుండా, అమెరికా మిత్రదేశాల్లో కూడా ఒక రకమైన అభద్రతా భావాన్ని కలిగిస్తోంది.

**ఇంధన మార్కెట్లో కలవరం**

ఈ దిగ్బంధం విఫలమైనప్పటికీ, ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు మళ్లీ $100 మార్కును దాటాయి. ఒకవైపు ప్రధాని మోడీ వంటి ప్రపంచ నేతలు శాంతిని కోరుతుండగా, మరోవైపు క్షేత్రస్థాయిలో అమెరికా-ఇరాన్ మధ్య జరుగుతున్న ఈ 'మైండ్ గేమ్' ఎటు దారితీస్తుందోనని ప్రపంచ దేశాలు ఆందోళన చెందుతున్నాయి.

# అడ్డంగా నరుకుతాం

మొదటి పేజీ తరువాయి

పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ ధర్మాసనం పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ సంస్థపై కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున, తుది తీర్పు వ్యతిరేకంగా వస్తే విద్యార్థులు ఎలాంటి హక్కులు కోరలేరని కోర్టు స్పష్టం చేసింది. విద్యా సంస్థ యాజమాన్యం తమ నోటీసు బోర్డులపై కేసు వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించాలని, తద్వారా అడ్మిషన్ల సమయంలో తల్లిదండ్రులకు పూర్తి సమాచారం తెలియాలని ఆదేశించింది.సల్కం చెరువు పరిధిలో ఇకపై ఎలాంటి అదనపు నిర్మాణాలు చేపట్టవద్దని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

**శాటిలైట్ చిత్రాల్లో అక్రమ కట్టడాలు?**

పిటిషనర్ తరపు వాదనలు విన్న న్యాయమూర్తి, పబ్లిక్ డొమైన్‌లో ఉన్న శాటిలైట్ చిత్రాలను పరిశీలించారు. ప్రాథమికంగా ఈ విద్యా సంస్థ చెరువు మధ్యలో మరియు బఫర్ జోన్‌లో నిర్మించినట్లు కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. ఏఐఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీకి చెందిన 'సలార్-ఎ-మిల్లత్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో ఈ సంస్థ నడుస్తోంది.

**హైడ్రా (HYDRAA) వివరణ ఏంటి?**

గతంలో ఈ విద్యా సంస్థపై చర్యల విషయమై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందిస్తూ.. ఈ కాలేజీలో 10 వేల మందికి పైగా పేద విద్యార్థులు ఉచితంగా విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. సామాజిక కోణంలో ఆలోచించి, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోలేకపోతున్నామని గతంలో వివరణ ఇచ్చారు. అయితే, ఇప్పుడు హైకోర్టు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించడంతో తదుపరి విచారణపై ఉత్కంఠ నెలకొంది.ఈ కేసు తదుపరి విచారణను హైకోర్టు ఏప్రిల్ 30కి వాయిదా వేసింది. జూన్ 1 నుండి ప్రారంభం కానున్న కొత్త విద్యా సంవత్సరంపై కోర్టు ఇచ్చే తుది తీర్పు ప్రభావం చూపే అవకాశం ఉంది.

# విదేశీ ఉద్యోగాల పేరుతో కోట్ల దోపిడీ

ఫౌండర్, సీఈఓ మరియు ఇతర నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. విదేశీ ఉద్యోగాల పేరుతో వచ్చే ప్రకటనలను క్షుణ్ణంగా పరిశీలించకుండా, లైసెన్స్ లేని కన్సల్టెన్సీలకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దని పోలీసులు నిరుద్యోగులకు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# రైస్ మిల్లుల రాజధానికి చైర్మన్ ఎప్పుడు?



- రెండేళ్లుగా ఎదురు చూపులు
- రాష్ట్రంలో అన్ని చోట్ల వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌లు
- మిర్యాలగూడ మార్కెట్ కు మాత్రం ఎందుకు లేరు?
- ఎన్నిక జాప్యం పట్ల ఎమ్మెల్యే బత్తుల వ్యూహం ఏంది
- చైర్మన్ ఎన్నిక చేయలేదని కాంగ్రెస్ పార్టీ అపవాద మూటగట్టుకోవాల్సిందేనా

**మిర్యాలగూడ, ప్రజా వాయిస్:** ఆసియా ఖండంలోనే ప్రముఖ రైస్ మిల్లుల కేంద్రంగా పేరుగాంచిన మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఇప్పటికీ చైర్మన్ నియామకం జరగకపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటినా ఈ కీలకమైన మార్కెట్ కమిటీకి నాయకత్వం లేకపోవడం రైతులు, వ్యాపారులు, రాజకీయ వర్గాల్లో ప్రశ్నలను రేకెత్తిస్తోంది. రాష్ట్రంలోని దాదాపు అన్ని నియోజకవర్గాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్‌ల నియామకం పూర్తయినప్పటికీ, మిర్యాలగూడ మార్కెట్ కమిటీ మాత్రం ఇప్పటికీ ఖాళీగానే కొనసాగుతోంది. వరి కొనుగోలు, బియ్యం ఉత్పత్తి భారీ స్థాయిలో జరిగే ఈ ప్రాంతంలో మార్కెట్ కమిటీ కీలక పాత్ర పోషిస్తుండగా, చైర్మన్ లేకపోవడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలు, పరిపాలనాత్మక నిర్ణయాలు ఆలస్యం అవుతున్నాయని రైతు, వ్యాపార వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. పదవికి పలువురు ఆశావహులు ఉండటం, రాజకీయ సమీకరణాలు సర్దుబాటు చేయాల్సిన పరిస్థితి ఉండటమే ఆలస్యానికి కారణమని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు మార్కెట్ కమిటీ చైర్మన్ ఎంపికపై స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఎలాంటి వ్యూహం అనుసరిస్తారన్నదానిపై ఆసక్తి నెలకొంది.

సర్పంచ్ ఎన్నికల తరువాత, అలాగే మునిసిపల్ ఎన్నికల తరువాత మార్కెట్ కమిటీ చైర్మన్ ఎన్నిక ఉంటుందని చాలామంది భావించినప్పటికీ నేటికి నియామకం జరగకపోవడం వెనుక అసలు కారణం ఏంటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పూర్తయ్యేవరకు వేచి చూడాల్సిందేనా? లేక కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మిర్యాలగూడ వంటి కీలక మార్కెట్ కమిటీకి చైర్మన్ నియామకం జరగలేదన్న అపవాదు మోసుకోవాల్సిందేనా అన్న చర్చ కూడా రాజకీయ వర్గాల్లో జరుగుతోంది.

**రెండేళ్లు గడిచినా ఖాళీగా చైర్మన్ పదవి**

రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చాలా నియోజకవర్గాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్‌లను నియమించినప్పటికీ, మిర్యాలగూడలో మాత్రం ఇప్పటికీ చైర్మన్ నియామకం జరగలేదు. దీంతో ఆశావహుల్లో నిరాశ నెలకొంది.

**రైస్ మిల్లుల రాజధాని మిర్యాలగూడ**

మిర్యాలగూడ ప్రాంతం ఆసియా ఖండంలోనే అత్యధిక రైస్ మిల్లులు ఉన్న ప్రాంతంగా గుర్తింపు పొందింది. వరి, బియ్యం వ్యాపారం భారీగా జరిగే ఈ ప్రాంతంలో మార్కెట్ కమిటీ వ్యవస్థ అత్యంత కీలకం.

**చైర్మన్ లేకపోవడంతో నిర్ణయాల్లో ఆలస్యం**

మార్కెట్ యార్డ్ అభివృద్ధి, రైతులకు అవసరమైన సదుపాయాలు, వ్యాపార నిర్వహణ వంటి అంశాల్లో చైర్మన్ లేకపోవడం వల్ల పలు నిర్ణయాలు ఆలస్యం అవుతున్నాయని స్థానికులు అంటున్నారు.

**రాష్ట్రంలో ఎంపికలు పూర్తి... ఇక్కడే ఎందుకు?**

రాష్ట్రంలోని చాలా చోట్ల మార్కెట్ కమిటీ చైర్మన్‌ల ఎంపిక పూర్తయింది. అయితే మిర్యాలగూడలో మాత్రం ఇప్పటికీ నియామకం జరగకపోవడం స్థానికంగా ప్రశ్నలు రేకెత్తిస్తోంది.

**ఎమ్మెల్యే వ్యూహం ఏంటి?**

మార్కెట్ కమిటీ చైర్మన్ ఎంపికపై ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నదానిపై ఆసక్తి నెలకొంది. ఆశావహుల మధ్య సమన్వయం సాధించిన తర్వాతే నిర్ణయం వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# మా మంత్రి రూటే సపరేట్

- నా కార్యకర్తలే నాకు ముఖ్యం
- మనోడు అయితే టీ స్టాల్ ఓపెన్ చేయడానికి కైనా వస్తా
- పేద రైతు పంట పొలం కాలిన... నివాస గృహాలు కాలిన సంబంధం లేదు
- ఇది మంత్రి పనితీరు





**ప్రజా వాయిస్,సంగారెడ్డి :** రాజకీయాలు అంటే ఎన్నికల వరకే పార్టీలు ఉంటాయి... ఎన్నికల గెలుస్తాం వోడుతాం అది సహజం... నియోజకవర్గానికి సంబంధించిన ఏ రాజకీయ పార్టీ కార్యకర్తకు నష్టం వచ్చిన కష్టమైన సాధ్యమైనంత వరకు ప్రభుత్వపరంగా కానీ వ్యక్తిగతంగా ఆదుకోవాల్సిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధి. కానీ తానే మోనార్కును అన్న తరహాలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ్య నరసింహ వివరిస్తున్న తీరు దీనికి చక్కటి నిదర్శనం. ఆదివారం రాత్రి పుల్కల్ మండల సమీపంలోని ఒక ప్రైవేట్ టీ స్టాల్ ఓపెన్ చేయడం కోసం వచ్చిన మంత్రి అక్కడికి కేవలం ఐదు నిమిషాల దూరంలో ఉన్న పుల్కల్ మండల కేంద్రంలో ప్రారంభం మా కోసం ఎదురుచూస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మాత్రం ప్రారంభించేందుకు సమయం ఇవ్వడం లేదు. దీంతో సామాన్య పేద ప్రజలు ఆరోగ్యానికి దూరమై సరైన వైద్యం అందక ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడింది. నిజంగానే టీ స్టాల్ ఓపెన్ చేసేందుకు వచ్చిన సందర్భంలో నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవం కోసం ఎదురు చూస్తున్న ఆసుపత్రిని ప్రారంభిస్తే మహిళలతో పాటు వివిధ రకాల జబ్బులతో పాటు బాధపడుతున్న వారికి సరైన వైద్యం అందించేందుకు వైద్యులు వచ్చే అవకాశం ఉండేది. కానీ తనకు ఎందుకులే నా కార్యకర్త నాకోసం పనిచేసిన వ్యక్తి కదా అని టీ స్టాల్ ప్రారంభించి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. కానీ కనీసం పేద ప్రజల కోసం నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రిని ఎందుకు ప్రారంభించలేకపోతున్నామని మానవతా దృక్పథంతో అయినా ఆలోచించ లేని పరిస్థితిలో ఉన్నాడు అంటే ఆయన పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు సింగూర్ ప్రాజెక్టు ప్రాంతంలో జరుగుతున్న సింగూర్ రెవిల్మెంట్ పనులతో పాటు సిసి లైనింగ్ పనుల పరిశీలన కోసం సోమవారం సాయంత్రం ఈ ప్రాంతానికి వచ్చారు. కనీసం పనులు ప్రారంభించిన అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆ సందర్భంలో అయినా మంత్రి వెళ్లేముందు పుల్కల్లో అగ్నిప్రభాదాన్ని గురై రెండు నీళ్లు పూర్తిగా దహనమై రెండు కుటుంబాలు రోడ్డున పడ్డాయి... దీని పక్కనే ఉన్న మధుమాణిక్యం గ్రామంలో ఓ రైతుకు సంబంధించిన నాలుగు ఎకరాల వరి పంట పూర్తిగా ఎండి పోతే రైతు భరించలేక కాల్చివేశాడు. కనీసం ఆ రైతును కూడా పరామర్శించలేని మంత్రి ఉన్నాడు అంటే ఈ నియోజకవర్గానికి ఇంత కంటే దురదృష్టకరం ఇంకేముంటుంది. మంత్రిగా మండల కేంద్రానికి మంజూరుఅయి నిర్మాణం పూర్తయిన ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభించారు ప్రజలకు సేవలందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోరు.. కానీ ఆ పార్టీ కార్యకర్త కేవలం ఒక టీ స్టాల్ ఏర్పాటు చేసి తన ప్రారంభించేందుకు ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని మొత్తం ఉపయోగించుకొని వచ్చి ప్రారంభించాడు. కానీ అగ్ని ప్రమాదానికి గురై రెండు నీళ్లు కాలిపోతే వారి కుటుంబాన్ని పరామర్శించేందుకు ఆయనకు కాలు ముందుకు రాలేదా కళ్ళు కనిపియ్యలేదా... ఇదే ప్రాంతాన్ని ప్రతిపక్ష పార్టీ చెందిన బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మాత్రం సోమవారం ముదుమాణికంలో పంటను కాలబెట్టిన రైతును పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించాడు. ఆ మాత్రం ప్రభుత్వ పరంగా సాయం చేయలేకపోయినా రైతును పరామర్శించి మీకు మేమున్నాం అన్న భరోసా ఇస్తే వాళ్ళల్లో కొంత ఆత్మ ధైర్యం పెరిగేది. అలా చేయకపోవడం మరి దారుణం... నిజంగా ఇలాంటి పరిణామాల గనుక జరిగితే వచ్చే ఎన్నికల్లో సొంత పార్టీ కార్యకర్తలు నాయకులే మంత్రి పని తీరుపై తీవ్ర విమర్శలు ఇప్పటికే గుప్పిస్తున్న బహిరంగంగానే నిలదీసే అవకాశం లేకపోలేదని చెప్పవచ్చు.

# తెలంగాణ జాగృతి వైపు యువ నాయకత్వం

- ముస్లిం మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి ముస్తఫా ఆధ్వర్యంలో చేరిక
- కల్వకుంట్ల కవిత సమక్షంలో తెలంగాణ జాగృతి గూటికి బిజెపి నాయకులు

**(ప్రజా వాయిస్ షాబాద్ )షాబాద్:** రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది తెలంగాణ జాగృతి ముస్లిం మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి ముస్తఫా ఆధ్వర్యంలో పలువురు షాబాద్ మండల బిజెపి నాయకులు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో చేరారు మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో బిజెపికి చెందిన ముఖ్య నాయకులు భారీ సంఖ్యలో తరలివచ్చి జాగృతి తీర్థం పుచ్చుకున్నారు ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత నూతనంగా చేరిన నాయకులకు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. తెలంగాణ సంస్కృతిని హక్కులను కాపాడటంలో జాగృతి పోషిస్తున్న పాత్రను గుర్తించి స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు అందరినీ కలుపుకొని రాష్ట్ర అభివృద్ధికి సామాజిక చైతన్యానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు పాల్గొన్న ముఖ్య నాయకులు జాగృతిలో చేరిన వారిలో బిజెపి నాయకులు నవీన్ కుమార్, నరేష్, విజయ్ కుమార్, రాఘవేందర్, ప్రశాంత్, విజయ్ కుమార్ , చంద్రశేఖర్ రాజు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.



# రహదారి నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ

- జిల్లా కలెక్టర్ కె. హరిత

**ప్రజా వాయిస్, ఆసిఫాబాద్ :** కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. 99 రోజుల ప్రజాపాలన ప్రణాళికలో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హరిత పాల్గొన్నారు.ఈ సందర్భంగా అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రహదారి నిబంధనలు పాటిస్తేనే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు.అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించడం ప్రమాదాలకు ప్రధాన కారణాలని హెచ్చరించారు. ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తే 'రహవీర్' పథకం కింద ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.







# పీవీటీజీల సమగ్ర సర్వేకు శిక్షణ ప్రారంభం

- డిప్యూటీ డైరెక్టర్ ఆర్. రమాదేవి

**ప్రజా వాయిస్, ఆసిఫాబాద్ :** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం పీవీటీజీ (అత్యంత వెనుకబడిన గిరిజనులు) సమగ్ర సర్వే నిర్వహణకు సంబంధించి శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఐటిడీఏ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ ఆర్. రమాదేవి మాట్లాడుతూ పీఎం జనమన్ పథకం కింద పీవీటీజీ గిరిజనుల వివరాలను గ్రామస్థాయిలో సమగ్రంగా సేకరించి సర్వేను సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. సర్వే ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా గిరిజనులకు అవసరమైన ప్రభుత్వ సేవలను చేరువ చేయనున్నట్లు తెలిపారు.పథకం అమలులో భాగంగా ఆధార్ నమోదు, ఆయుష్మాన్ భారత్ కార్డు, జన్ ధన్ ఖాతాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు వంటి సౌకర్యాలు అందించనున్నట్లు వెల్లడించారు. అలాగే ఎంపికైన గిరిజన హాబిటేషన్లలో మౌలిక వసతులు, వైద్య, విద్య, తాగునీరు, రహదారులు, గృహ వసతి వంటి అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాథోడ్ రవీందర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజలకు మరింత చేరువలో పోలీసులు


- నూతన భరోసా భవనం ప్రారంభించిన రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి



**ప్రజా వాయిస్, నిర్మల్ :** నిర్మల్ జిల్లాలో మహిళలు, బాలలపై జరిగే నేరాల బాధితులకు తక్షణ న్యాయం, మానసిక ధైర్యం, చట్టపరమైన సహాయం అందించే లక్ష్యంతో నూతనంగా నిర్మించిన భరోసా భవనాన్ని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి మంగళవారం ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్మల్ జిల్లాకు వచ్చిన డీజీపీకి గంజాల్ టోల్ ప్లాజా వద్ద జిల్లా పోలీసు అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సోన్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తరువాత భరోసా భవనం ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ సందేశం ఇచ్చారు.తదుపరి పోక్సో కేసుల బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే కుటుంబ విభేదాల కారణంగా విడిపోయి మళ్లీ కలిసిన జంటలకు ప్రోత్సాహకంగా గిఫ్టులు పంపిణీ చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్‌కు రెండు చొప్పున మొత్తం 20 పోలీస్ స్టేషన్లకు 40 హెల్మెట్లు అందజేశారు. విధుల నిర్వహణ సమయంలో పోలీసు సిబ్బంది తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు.ఈ సందర్భంగా డీజీపీ బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ... మహిళలు, బాలలపై జరిగే నేరాలకు వేగంగా స్పందిస్తూ బాధితులకు అన్ని విధాల సహాయం అందించడంలో భరోసా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. బాధితులకు న్యాయపరమైన, మానసిక, సామాజిక సహకారం అందించేలా ఈ కేంద్రాలు పనిచేస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, భైంసా ఏఎస్పీలు రాజేష్ మీనా, సాయి కిరణ్, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, షీటీం సభ్యులు, భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

# రౌడీషీటర్ విత్తనాల నాగరాజు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

- వ్యాపారస్తులను బెదిరిస్తే కఠిన చర్యలు తప్పవు
- కోరుట్ల సీఐ సురేష్ బాబు హెచ్చరిక






**ప్రజా వాయిస్, కోరుట్ల:** కోరుట్ల పట్టణంలోని వ్యాపారవేత్తలను చంపుతానని బెదిరిస్తూ, బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న రౌడీషీటర్ విత్తనాల నాగరాజును మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, మెట్పల్లి డి.ఎస్.పి ఏ. రాములు పర్యవేక్షణలో కోరుట్ల సీఐ బి. సురేష్ బాబు తన సిబ్బందితో కలిసి నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితుడు విత్తనాల నాగరాజుపై గతంలోనే రెండు హత్య కేసులు (మర్డర్), పలు ఎక్స్టార్షన్ కేసులు నమోదైనట్లు సీఐ వెల్లడించారు. గతంలో ఇతనిపై పీడీ యాక్ట్ (PD Act) నమోదు చేసి జైలుకు పంపినట్లు తెలిపారు. అయినా తన ప్రవర్తన మార్చుకోకుండా మళ్లీ వ్యాపారవేత్తలను లక్ష్యంగా చేసుకుని దౌర్జన్యాలకు దిగుతుండటంతో పోలీసులు కఠినంగా వ్యవహరించారు. ప్రస్తుత కేసులో నాగరాజుతో పాటు మరో నిందితుడు కూడా ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని, ప్రస్తుతం అతను పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. అతి త్వరలోనే అతడిని కూడా అరెస్ట్ చేస్తామని స్పష్టం చేశారు. ఈ కేసును అత్యంత సూక్ష్మంగా (Minute investigation) దర్యాప్తు చేస్తున్నామని, వీరి వెనుక ఇంకెవరున్నా ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. రౌడీషీటర్ నాగరాజుతో గానీ, అతని అనుచరులతో గానీ సంబంధాలు కలిగి ఉండి వారితో తిరిగే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ హెచ్చరించారు. ఎవరైనా సరే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కోరుట్ల పట్టణ మరియు పరిసర గ్రామ ప్రజలు ఎవరూ ఇలాంటి బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదని సీఐ భరోసా ఇచ్చారు. "ఎవరైనా మిమ్మల్ని భయభ్రాంతులకు గురిచేసినా, డబ్బుల కోసం బెదిరించినా నిర్భయంగా పోలీసులకు సమాచారం ఇవ్వండి. మీ వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతాం" అని ఆయన విజ్ఞప్తి చేశారు.



# చిన్న ఆత్మకూరు సర్పంచి తో సహా 50 మంది కాంగ్రెస్ లో చేరిక

**ప్రజావాయిస్ ఎల్లారెడ్డి/** ఎమ్మెల్యే మదన్ మోహన్ అభివృద్ధి ప్రభావం చూసి చిన్న ఆత్మకూరు గ్రామ సర్పంచ్ అనిత లచ్చయ్య , పాలకవర్గ సభ్యులతో కలిసి సుమారు 50 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారని ఎల్లారెడ్డి కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.అనంతరం ఎమ్మెల్యే మదన్ మోహన్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి హృదయపూర్వకంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మాట్లాడుతూ, మీసాన్‌పల్లి గ్రామంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు తమను ఆకర్షించాయని తెలిపారు. సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సంఘాల భవనం, ధాన్యం నిల్వ గోదాం వంటి పలు అభివృద్ధి పనులు మంజూరు చేసి వేగంగా అమలు చేస్తున్న విధానం చూసి కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.ఈ పరిణామం ఎల్లారెడ్డి నియోజకవర్గ రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుందనీ కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి

# కార్పొరేషన్ సొత్తు విచారణపై నీలి నీడలు!

- చోరీ స్థలం మాది కాదంటూ తప్పించుకునే యత్నం!
- స్మగ్లర్లకు అధికారుల అండదండలేనా?
- కథనాలు రాసిన ప్రతినిధులకు బెదిరింపులా?
- అటవీ అధికారులే సంపదను అమ్ముకుంటున్నారనే ఆరోపణలు!
- అమాయక గిరిజనులను బలిపశువులుగా మారుస్తున్నారా?
- ప్రభుత్వ ఆస్తిపై ప్రైవేట్ రాబందుల పీడన!
- చట్టమా నీ జాడ ఎక్కడ? న్యాయమా నీకు స్థానం ఉందా!?



**ప్రజా వాయిస్ – అశ్వారావుపేట** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం పాకలగూడెం గ్రామ సమీపంలోని తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ పరిధిలో జరిగిన జామాయిల్ కర్ర చోరీ ఘటనపై విచారణ తూతూ మంత్రంగా సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం కొందరు అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టినా, నిజమైన నిందితులను బయటకు తీసే దిశగా చర్యలు కనిపించడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.ఈ ఘటనకు సంబంధించి ఎఫ్‌డీఓ శిరోమణి సంఘటన స్థలాన్ని పరిశీలించి, ఎన్ని చెట్లు చోరీ జరిగాయన్న వివరాలు సేకరించినట్లు సమాచారం. అయితే చోరీ జరిగిన ప్రదేశం తమ పరిధిలోది కాదని, అది ప్రైవేట్ భూమి అంటూ కొట్టి పారేసే ప్రయత్నం జరుగుతోందన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఇదంతా అసలు సూత్రధారులను తప్పించేందుకు అధికార యంత్రాంగమే రాజమార్గాలు వెతుకుతున్నట్లు ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉండగా, లక్షల రూపాయల విలువైన అటవీ సంపద చోరీని వెలుగులోకి తెచ్చిన పత్రికా ప్రతినిధులకు బెదిరింపులు వస్తున్నాయని కూడా ప్రచారం జరుగుతోంది. ఇది మరింత అనుమానాలకు తావిస్తోంది.

### స్మగ్లర్లతో అధికారుల ఒప్పందమా?

అటవీ సంపదను రహస్యంగా తరలించేందుకు కొందరు స్మగ్లర్లు, అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు మధ్య ఒప్పందం కుదిరిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. గత ఏడాది నుంచి రెడ్డిగూడెం పరిసర కార్పొరేషన్ జామాయిల్ ప్లాంటేషన్‌లో భారీగా దొంగతనాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం వెనుక పెద్దల పాత్ర ఉందన్న అనుమానాలు బలపడుతున్నాయి.

### విధులకు హాజరు అవుతున్నారా? లేక గ్రామాల్లో సేద తీరుతున్నారా?

అశ్వారావుపేట పట్టణం నుంచి కార్పొరేషన్ సెక్టార్లకు చేరాలంటే దాదాపు 30 కిలోమీటర్లు ప్రయాణించి రెడ్డిగూడెం చేరాలి. అక్కడి నుంచి మరో ఐదు కిలోమీటర్లు అటవీ ప్రాంతంలోకి వెళ్లాల్సి ఉంటుంది. ఈ దూరం, కష్టాన్ని కారణంగా చూపుతూ కొందరు అధికారులు విధులకు వెళ్లకుండా, సమీప గ్రామాల్లోనే ఉండి స్మగ్లర్ల సహకారంతో అడవిని "కాపాడుతున్నాం" అని నమ్మబలుకుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.అధికారులకు కావాల్సిన మద్యం, మాంసం వంటి వాటిని స్మగ్లర్లే సమకూరుస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇలా అధికారుల నిర్లక్ష్యంతో అడవిసంపదను యథేచ్ఛగా తరలిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

### గతంలోనే లారీలతో దోచుకున్న చరిత్ర?

అశ్వారావుపేట అటవీ కార్పొరేషన్ సంస్థ పరిధిలో వేల ఎకరాల భూములు ఉన్నాయి. వాటిలో రెడ్డిగూడెం సమీపంలో 150 నుంచి 200 హెక్టార్ల మేర జామాయిల్ ప్లాంటేషన్ ఉన్నట్లు సమాచారం. 2020–21 సంవత్సరంలో అప్పటి ఎఫ్‌డీఓ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జామాయిల్ పంటను నరికించి ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చినట్లు తెలుస్తోంది.అయితే అప్పట్లోనే కొందరు కిందిస్థాయి ఉద్యోగులు జామాయిల్ కర్రను లారీల ద్వారా అక్రమంగా తరలించి లక్షల రూపాయలు సంపాదించారని ప్రచారం నేటికీ వినిపిస్తోందని స్థానికులు చెబుతున్నారు. అటువంటి చరిత్ర ఉన్న చోట ఇప్పుడు మళ్లీ అదే తరహా దోపిడీ జరుగుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### తూతూ మంత్రంగా విచారణ... ఆపై రాజమార్గం?

పాకలగూడెం సమీపంలో జరిగిన చోరీ ఘటనలో కిందిస్థాయి ఉద్యోగులపై చర్యలు తీసుకోవడంలో కొందరు ఉన్నతాధికారులు కూడా వెనకడుగు వేస్తున్నారని విశ్వసనీయ సమాచారం. కార్పొరేషన్ సెక్టార్లలో పనిచేస్తున్న సిబ్బందితో ఉన్నతాధికారులకు సన్నిహిత సంబంధాలు ఉండటం వల్లే చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.ఇంకా ఆశ్చర్యకరంగా, గతంలో పనిచేసిన ఓ అధికారి ఇప్పటికీ కార్పొరేషన్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని, వారి ఆదేశాల మేరకే విధులు సాగుతున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. బదిలీపై వెళ్లిన అధికారులు కూడా ఫోన్ల ద్వారా పాత ప్రాంతంలోనే చరవాణి నడుపుతున్నారని ఆరోపణలు ప్రజల్లో చర్చకు దారితీస్తున్నాయి.

### అమాయక గిరిజనులే బలిపశువులా?

ఈ ఘటనలో అసలు దొంగలను కాపాడి, వినాయకపురం, రెడ్డిగూడెం, పాకలగూడెం ప్రాంతాలకు చెందిన కొందరు గిరిజనేతరుల్ని వదిలేసి, ఇద్దరు అమాయక గిరిజనులను బలిపశువులుగా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆరోపిస్తున్నారు. నిజమైన సూత్రధారులను తప్పించేందుకు కుట్ర జరుగుతోందని వారు అంటున్నారు.

### పూర్తిస్థాయి విచారణ జరపాలన్న డిమాండ్

కార్పొరేషన్ ప్లాంట్ మేనేజర్‌తో పాటు జిల్లా స్థాయి అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపడితే, మరిన్ని సంచలన విషయాలు బయట పడే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కొందరు అధికారులు విధులకు వెళ్లకుండానే జీతాలు పొందుతున్న అంశాలు కూడా వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వ ఆస్తిని ప్రైవేట్ వ్యక్తులు దోచుకుంటుంటే అధికారులు చూస్తూ ఊరుకోవడం దురదృష్టకరమని, ఇప్పటికైనా నిజమైన దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# వెంటనే వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

- కవ్వ వేణుగోపాల్ రెడ్డి, భారతీయ కిసాన్ సంఘ్ డివిజన్ ఇంచార్జ్


**ప్రజా వాయిస్ | హుస్నాబాద్** వరి కోతలు ప్రారంభమై రైతులు మార్కెట్లకు, ఐకెపి కేంద్రాలకు పంటను తరలించినా ప్రభుత్వం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించకపోవడంపై భారతీయ కిసాన్ సంఘ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. డివిజన్ ఇంచార్జ్ కవ్వ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మాటలకే పరిమితమై ఆచరణలో విఫలమైందని మండిపడ్డారు.కొనుగోలు కేంద్రాలు సకాలంలో ప్రారంభం కాకపోవడంతో రైతులు దళారులు, మిల్లర్ల చేతిలో మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ఇవ్వకుండా కేవలం రూ.1800కే కొనుగోలు చేస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. అలాగే 'తాలు సంచి' పేరుతో ఒక్కో బస్తాపై 3 నుంచి 5 కిలోల వరకు అదనంగా కోత విధిస్తూ వ్యాపారులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు.అకాల వర్షాల ముప్పు ఉన్న నేపథ్యంలో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కాపాడుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మొక్కజొన్న, సన్‌ఫ్లవర్, వడ్ల రైతులు రోజుల తరబడి నిరీక్షిస్తున్న పరిస్థితి దారుణంగా ఉందన్నారు. సొసైటీ అధికారులు, మార్క్‌ఫెడ్ అధికారులు తేమ శాతం కారణంగా చూపి కొనుగోలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు.ఈ పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, అలాగే సిద్దిపేట జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ గారు వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. తక్షణమే పంట సేకరణ ప్రారంభించకపోతే ఐకెపి కేంద్రాలు, మార్కెట్ యార్డుల్లో పంటతో నిరీక్షిస్తున్న రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



# తండాల్లో నాటు సారా వేట.. ఇద్దరిపై కేసులు నమోదు

- సారా తయారీదారులపై ఉక్కుపాదం
- హుస్నాబాద్ ఎక్సైజ్ పోలీసుల సంయుక్త దాడులు

**ప్రజా వాయిస్ హుస్నాబాద్** :సిద్దిపేట జిల్లా మద్య నిషేధ మరియు ఎక్సైజ్ అధికారి శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు మంగళవారం తెల్లవారుజామున జిల్లా ప్రత్యేక బృందం మరియు హుస్నాబాద్ ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా మెరుపు దాడులు నిర్వహించారు. అక్కన్నపేట మండలంలోని పలు తండాల్లో అక్రమంగా తయారవుతున్న నాటు సారాను అడ్డుకుని భారీగా ముడి పదార్థాలను ధ్వంసం చేశారు. అక్కన్నపేట మండల పరిధిలోని మల్చెరువు తండా, దుబ్బ తండా, కపూర్ నాయక్ తండా గ్రామాల్లో విస్తృత తనిఖీలు చేపట్టిన అధికారులు రెండు లీటర్ల నాటు సారాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే సారా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు వంద లీటర్ల బెల్లం పానకాన్ని అక్కడికక్కడే పారబోసి ధ్వంసం చేశారు. సారా తయారీలో ఉపయోగించే పాత్రలు, ఇతర సామాగ్రిని కూడా పగులగొట్టి ధ్వంసం చేశారు. అక్రమంగా నాటు సారా తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసినట్లు హుస్నాబాద్ ఎక్సైజ్ సీఐ పవన్ తెలిపారు. ఈ దాడుల్లో జిల్లా ప్రత్యేక బృంద సీఐ కె. శ్రీధర్, ఎస్సైలు సరిత, దామోదర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నాటు సారా తయారీ, రవాణా, విక్రయం, ముడి పదార్థాల నిల్వ వంటి చర్యలు తీవ్రమైన నేరమని, ఎవరు ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



# లబ్ధిదారులకు ₹1.11 కోట్ల చెక్కుల పంపిణీ

- ఎమ్మెల్యే డా,, పట్లోల్ల సంజీవరెడ్డి.
- కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా 93 మందికి లబ్ధి
- ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 24 మందికి ఆర్థిక సహాయం

**ప్రజా వాయిస్, పెద్ద శంకరంపేట:** శంకరంపేట మండల కేంద్రంలో ఉన్న రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల చెక్కులను పంపిణీ చేశారు.మండలంలోని పలు గ్రామాలకు చెందిన 93 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల కింద ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే ఆరోగ్య సమస్యలతో చికిత్స పొందిన 24 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే అందించారు. ఈ పథకాల ద్వారా మొత్తం రూ.1 కోటి 11 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆడబిడ్డల వివాహాలకు ఆర్థికంగా బాసటగా నిలిచే కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకాలు కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే ఆపద సమయంలో వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయ నిధి పేద కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తుందని అన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, రెవెన్యూ సిబ్బంది మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పుల్కల్ సాయి భారత్ గ్యాస్ ఏజెన్సీపై తనిఖీ

- సరఫరా వేగవంతం చేయాలని ఆదేశాలు



**ప్రజా వాయిస్,సంగారెడ్డి :** పుల్కల్‌లోని సాయి భారత్ గ్యాస్ ఏజెన్సీపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో సంబంధిత అధికారులతో కలిసి తనిఖీ నిర్వహించగా, మొత్తం 1275 మంది వినియోగదారులు బుకింగ్ చేసుకున్నప్పటికీ కేవలం 290 సిలిండర్లు మాత్రమే డెలివరీ చేయబడినట్లు, ఇంకా 988 బుకింగ్స్ పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయంపై డీసీఎస్ఓ గారు గ్యాస్ కంపెనీ సేల్స్ అధికారితో మాట్లాడి వెంటనే సరఫరా చేయాలని ఆదేశించగా, డీలర్లు సరఫరాను వేగవంతం చేయాలని సూచించారు. "వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్యాస్ సిలిండర్లు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలి" అని హెచ్చరిస్తూ, ఏజెన్సీ యజమానికి 40–50 సిలిండర్లను నిల్వలో ఉంచాలని సూచించారు. అలాగే ఏప్రిల్ 15 నాటికి 344 సిలిండర్లు, ఏప్రిల్ 16 నాటికి పూర్తి సరఫరా చేయాలని ఆదేశించారు.

# రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో రోషిణికి స్వర్ణం



**ప్రజా వాయిస్, కోరుట్ల:** హనుమకొండలోని జేఎన్ఎస్ (JNS) స్టేడియంలో ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించిన 11వ తెలంగాణ రాష్ట్ర సీనియర్ మరియు ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్ పోటీల్లో జగిత్యాల జిల్లాకు చెందిన క్రీడాకారిణి అద్భుత ప్రతిభ కనబరిచారు. కోరుట్ల గ్రామానికి చెందిన శ్రీరాముల రోషిణి మహిళల విభాగం 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. జిల్లా విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటడంపై జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎలేటి ముత్తయ్య రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్వర్ణ పతక విజేత రోషిణిని అసోసియేషన్ కార్యదర్శి ముత్తయ్య రెడ్డితో పాటు కోశాధికారి బైకని కొమురయ్య, ప్రతినిధులు రాందాస్, అంజయ్య మరియు విద్యార్థిని తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.



# నేడు హిందూ మహా సమ్మేళనం

**ప్రజా వాయిస్ కౌటాల:** బుధవారం రోజున సాయంత్రం 4–00గం,, లకు కౌటాల మండల కేంద్రంలోని మినీ స్టేడియం యందు జరగబోయే భవ్య హిందూ మహా సమ్మేళనం సభ కార్యక్రమం ను విజయవంతం చేయాలనీ మాధవరం రంగాస్వామి జీ కరీంనగర్ విభాగ్ సహ కార్యవహ పిలుపు నిచ్చారు. ఇట్టి సమావేశం లో హిందూ సమ్మేళనం సమితి అధ్యక్షులు కుర్సింగా దౌలత్ జీ,ఉప అధ్యక్షులు అనిల్ జీ, ఎల్క సత్యనారాయణ,యాదగిరి జీ, రాచకొండ సాయి, తిరుపతి చారి జీ, తిరుపతి రెడ్డి,ఖండ కార్యవహ ప్రభిర్ కుమార్ మండల్,కౌటాల ఉప మండల్ ప్రముఖ్ ఏల్ములే దత్తు జీ,జిల్లా శారీరక్ ప్రముఖ్ నగేష్ జీ మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కొండకల్ తండాలో ఆలయానికి అడ్డుగా గేట్లు





- గ్రామస్తుల ఆగ్రహంవల్లభ స్వామి దేవాలయ భూమిలో అక్రమ తవ్వకాల ఆరోపణ
- ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఆర్డిఓ, ఎమ్మార్వో, పోలీసులు
- ఆలయ మార్గం తెరవాలని గ్రామస్తుల డిమాండ్
- అనుమతి లేకుండా మట్టి తవ్వకాలపై అధికారుల విచారణ

**ప్రజా వాయిస్, శంకర్ పల్లి :–** శంకర్‌పల్లి మండల పరిధిలోని కొండకల్ తండాలో ఉన్న వల్లభ స్వామి దేవాలయానికి వెళ్లే మార్గాన్ని ఒక ప్రైవేటు సంస్థ పెద్ద గేట్లు ఏర్పాటు చేసి అడ్డుకుంటోందని గ్రామస్తులు ఆరోపించారు. ఆలయానికి చెందిన సుమారు 40 ఎకరాల భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ విషయంపై మంగళవారం చేవెళ్ల ఆర్డీఓ పార్థసారథి, శంకర్‌పల్లి ఎమ్మార్వో సురేందర్, మోకిలా సీఐ వీరబాబు, అలాగే ఎండోమెంట్ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. గ్రామస్తుల అభ్యంతరాలను విన్న అధికారులు పూర్తి వివరాలు సేకరించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.దేవాలయానికి వెళ్లే మార్గాన్ని వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని, అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని గ్రామస్తులు అధికారులను కోరారు

# గుండ్రపల్లిలో 'పూర్వ విద్యార్థుల సమ్మేళనం'

- గురువులకు ఘనంగా సన్మానం చేసిన విద్యార్థులు

**ప్రజా వాయిస్ న్యూస్ /కొత్తగూడ** కొత్తగూడ మండలంలోని దుర్గారం గ్రామ పంచాయతీ పరిధిలో గల గుండ్రపల్లి మండల ప్రజా పరిషత్ పాఠశాల (ఎంపీపీ ఎస్ ) ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం అత్యంత ఉత్సాహంగా నిర్వహించబడింది. ఏళ్ల క్రితం ఇదే పాఠశాలలో చదువుకుని, ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడిన విద్యార్థులందరూ ఒకే వేదికపైకి వచ్చి పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు.ఈ కార్యక్రమం కేవలం కలుసుకోవడానికే పరిమితం కాకుండా, తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుల పట్ల కృతజ్ఞత చాటుకోవడానికి వేదికైంది. పాఠశాల ఉపాధ్యాయులు జాటోత్ జుమ్యాలాల్ మరియు బాదావత్ సరియాలను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి, పూలమాలలతో వారిని గౌరవించి, తమ ఎదుగుదలలో ఉపాధ్యాయులు పోషించిన పాత్రను ఈ సందర్భంగా విద్యార్థులు కొనియాడారు.చదువుకున్న రోజుల్లోని అల్లరి, ఆటపాటలు, ఉపాధ్యాయుల క్రమశిక్షణ వంటి విషయాలను గుర్తుచేసుకుంటూ విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. తమ గ్రామంలోని పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ఈ సందర్భంగా వారు ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన ప్రముఖులు, పూర్వ విద్యార్థులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఉల్లి రైతు కంట కన్నీరు

- పెట్టిన పెట్టుబడి చేతికి రాక అల్లాడుతున్న రైతులు
- పాతాళానికి పడి పోయిన ఉల్లి ధర
- ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతులను ఆదుకోవాలి



**ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** ఆరుగాలం కష్టపడి పండించిన ఉల్లి పంటకు గిట్టుబాటు ధర లేక,కష్టపడి పండించిన పంటకు కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రాక రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్ ఉల్లి ధర రూ.1,000 – రూ1,200 మధ్య పడిపోవడంతో, రవాణా, కోత ఖర్చులు కూడా భరించలేక నరకయాతన అనుభవిస్తున్నారు. వేల రూపాయల అప్పు చేసి ఎకరాకు సుమారు రూ.50,000 వరకు పెట్టుబడి పెడితే ఆ ఖర్చు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు.చేతికి వచ్చిన పంటను మార్కెట్‌కు తరలించే రవాణా ఖర్చులు, కమీషన్లకే సొంత డబ్బులు ఖర్చు చేసుకోవాల్సి వస్తోంది.అయితే ఉల్లి గడ్డ నిల్వ ఉంచితే వర్షం కారణంగా మురిగిపోతుందనే భయంతో..ఎంతో కొంత వస్తుందేమోనని కొందరు రైతులు వికారాబాద్ పట్టణంలోని ప్రధాన రోడ్డుపై ట్రాక్టర్ పెట్టుకొని నేరుగా వినియోగదారులకు అతి తక్కువ ధరకు విక్రయించాల్సిన పరిస్థితి తలెత్తింది. ప్రభుత్వం ఇప్పటికైనా జోక్యం చేసుకుని గిట్టుబాటు ధర కల్పించాలని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజా వాయిస్

బుధవారం 15-04-2026



## సామాజిక న్యాయానికి అంబేద్కర్ చూపిన మార్గం ఆదర్శనీయం

- మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ప్రజా వాయిస్ సంగారెడ్డి:** భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి 135వ జయంతి సందర్భంగా మంగళవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సామాజిక న్యాయం, సమానత్వం, హక్కుల పరిరక్షణ కోసం చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని తెలిపారు. భారత రాజ్యాంగ రూపకర్తగా దేశ నిర్మాణంలో ఆయన చేసిన అపార సేవలను మంత్రి స్మరించుకున్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి అమలు చేస్తోందని, సమాన అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, విద్యా,ఉపాధి అవకాశాలు అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితోనే కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. యువత అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, మున్సిపల్ చైర్పర్సన్ కూన వనిత సంతోష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ప్రపంచానికే మార్గదర్శి

- సుల్తానాబాద్ లో అంబేద్కర్ జయంతి వేడుకలు
- నివాళులు అర్పించిన- ప్రభుత్వ విప్ విజయరమణ రావు.
- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :** అంబేద్కర్ ప్రపంచానికే మార్గదర్శి అని ప్రభుత్వ విప్ విజయరమణ రావు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ అన్నారు.భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించి అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకను ఘనంగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ.అలాగే సుల్తానాబాద్ పట్టణం లోని కోర్ట్, పూసాల రోడ్డు లో గల బీజేపీ కార్యాలయం లో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్,తహసీల్దార్ బషీరొద్దీన్, మున్సిపల్ కమీషనర్ రమేష్,మున్సిపల్ చైర్మన్ బిరుదు కృష్ణ, వైస్ చైర్మన్ అంతటి పుష్పలత, కౌన్సిలర్లు,పోలీస్ సిబ్బంది,పలు గ్రామాల సర్పంచ్ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అంబేద్కర్ ఉత్సవ కమిటీ సభ్యులు,అంబేద్కర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.






## అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ

- పూలమాల వేసి నివాళులర్పించిన కలెక్టర్ ఆదర్శ సురభి, చిన్నారెడ్డి, శివసేన రెడ్డి

**ప్రజా వాయిస్, వనపర్తి జిల్లా** ప్రపంచ మేధావి, నవ భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతిని మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య కళ్యాణ మండపంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి, తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఆదర్శ సురభి మాట్లాడుతూ సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి విలువలను రాజ్యాంగం ద్వారా దేశానికి అందించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. అంబేద్కర్ చూపిన మార్గం సమాజానికి ఎల్లప్పుడూ దిశానిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా సమాన అవకాశాలు కల్పించే సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం అంబేద్కర్ స్ఫూర్తితో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దర్యాపోగు వెంకటేష్, విశ్వం బాబు, ఎడవల్లి వీరప్ప, మదారి భోజరాజు, చిట్యాల వెంకటేష్, మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు గంధం నాగరాజు, ఎమ్మార్వో, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ వైస్ చైర్మన్ మధు గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, అంబేద్కర్ సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ మేధావికి ఘన నివాళులు

- అంబేద్కర్ 135వ జయంతిని ఘనంగా నిర్వహించిన ఆదివాసీ, దళిత సంఘాలు

**ప్రజా వాయిస్ న్యూస్ / కొత్తగూడ:** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలో ఆదివాసీ ప్రజా సంఘాలు, అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో డా. బీ.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ప్రజా సంఘాలు, ఆదివాసీ ఉద్యోగ సంఘాలు, ఎంఆర్పీఎస్, ఎల్హెచ్పీఎస్తో పాటు బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ తదితర రాజకీయ పార్టీల నాయకులు, యువజన సంఘాలు, వ్యాపార సంఘాల నాయకులు పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డా. అంబేద్కర్ అందరివాడని, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు సహా అణగారిన వర్గాల ప్రజల స్వేచ్ఛ, హక్కుల కోసం ఆయన జీవితాంతం పోరాడారని తెలిపారు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించి స్వదేశానికి వచ్చాక కులవ్యవస్థ, అంటరానితనం నిర్మూలన కోసం ఉద్యమించారని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం భారత రాజ్యాంగ నిర్మాతగా, తొలి న్యాయ మంత్రిగా, గొప్ప ఆర్థికవేత్తగా ప్రపంచ మేధావిగా డా. అంబేద్కర్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షులు దాట్ల నాగేశ్వర్ రావు, తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెల రాము, తుడుం దెబ్బ నాయకులు కుంజ నర్సింగ రావు, పూనెం సందీప్, సిద్దబోయిన భాస్కర్, ఎంఆర్పీఎస్ నాయకుడు మీడిత పెల్లి యాకయ్య మాదిగ, ఆదివాసీ ఉద్యోగ సంఘాల నాయకులు డా. వాసం వీరస్వామి, డా. పుల్సం సాంబయ్య, సిద్దబోయిన బిక్షం, వట్టం సాయిలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు వజ్జ సారయ్య, కొమ్మన బోయిన వేణు, యాదగిరి మురళి తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.



## అక్షర యోధునికి అక్షర నీరాజనం!



- నీలి సంద్రమైన జనవాహిని.. ఒక్కటైన కులాలు, మతాలు
- చరిత్ర పుటల నుంచి జనహృదయాల్లోకి.. 'భీమ్' గర్జన!
- అంబేద్కర్ ఆశయాలకు జైకొట్టిన జనం!
- ఘనంగా బాబాసాహెబ్ 135వ జయంతి వేడుకలు
- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి
- ముఖ్య అతిథులుగా విప్ వేముల వీరేశం, డీసీసీ అధ్యక్షులు పున్నా కైలాష్

**మిర్యాలగూడ, ప్రజా వాయిస్**..భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు మిర్యాలగూడ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బి.ఎల్.ఆర్) ఆధ్వర్యంలో అన్ని కుల సంఘాలు, రాజకీయ పార్టీలు, దళిత సంఘాలను ఏకతాటిపైకి తెచ్చి వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించగా, ఉదయం రాజీవ్ భవన్‌లో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం రాజీవ్ చౌక్ నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. 'జై భీమ్' నినాదాలతో పట్టణం మారుమోగగా బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, డీసీసీ అధ్యక్షులు పున్నా కైలాష్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఎమ్మెల్యే బి.ఎల్.ఆర్ మాట్లాడుతూ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం వల్లే నేడు ప్రజలందరూ సమాన హక్కులు అనుభవిస్తున్నారని, 'చదువుకో.. వ్యవస్థీకృతం అవ్వు.. పోరాడు' అనే సందేశం యువతకు మార్గదర్శకం అని తెలిపారు. వేడుకల్లో భాగంగా సహపంక్తి భోజనాలు నిర్వహించడంతో పాటు రక్తదాన శిబిరం, ఉచిత పెరుగన్నం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించగా, వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, అంబేద్కర్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.

## అంబేద్కర్ చేసిన సేవలుఎనలేనివి జిల్లాఎస్పీ

- రాజ్యాంగ నిర్మాత డా, బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు

**ప్రజావాయిస్ రాజన్నసిరిసిల్ల** డా,బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు దేశానికి డా,బిఆర్ అంబేద్కర్ చేసిన సేవలు ఎనలేనివనీ రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి,గితే కొనియాడారు,భారతరత్న డా,బి ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారుఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేటి యువత అంబేద్కర్ ఆశయాలతో ముందుకు సాగుతూ దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారుజిల్లా వ్యాప్తంగా డా,బి,ఆర్ అంబేద్కర్ జయంతి జరిపారు ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య,సి.ఐ నటేష్,ఆర్.ఐ లు మధుకర్, రమేష్, ఎస్ఐ కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



## డా:బి.ఆర్.అంబేద్కర్ ఆశయాల కోసం అందరూ కృషి చేయాలి

- ఆర్జీ త్రీ జి.యం: సుంకర మధుసూదన్.
- ఏఎల్పి జి.యం: కొలిపాక నాగేశ్వరరావు

**ప్రజా వాయిస్ రామగిరి పెద్దపల్లి జిల్లా** రామగిరి మండలం రామగుండం అర్జీ త్రీ ఏరియా లో డా:బి.ఆర్.అంబేద్కర్ ఆశయాల కోసం అందరూ కృషి చేయాలనీ రామగుండం అర్జీ త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు అన్నారు.భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను సింగరేణి సంస్థ ఆర్జీ త్రీ మరియు ఏ.పి.ఏ ఏరియాల ఆధ్వర్యంలో స్థానిక రాణిరుద్రమ దేవి క్రీడా ప్రాంగణం ముందు గల ప్రాంగణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఇట్టి వేడుకలకు రామగుండం అర్జీ త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై పతాకావిష్కరణ గావించి జయంతి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. ముందు గా బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి,చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సభా కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ మన దేశం భిన్న సంస్కృతులు, భాషలు,ప్రాంతాలు, ఆహారపు అలవాట్లు కలిగిన దేశం.అణగారిన వారికి ప్రత్యేక హక్కులు అవకాశాలు ఉన్నప్పుడే బడుగు,బలహీన వర్గాలు,కార్మిక వర్గాలు అభివృద్ధి చెందుతాయని అంబేద్కర్ భావించి వారికి ఆ దిశగా హక్కులు కల్పించారన్నారు.ఈ ప్రత్యేక అవకాశాలందుకుని అభివృద్ధి చెందిన వారు తాము పొందిన ఫలాలను ఇతరులకు కూడా అందేలా కృషి చేయాలన్నారు. డా:బి.ఆర్.అంబేద్కర్ కొందరి వాడు కాదని, అందరి వాడని అన్నారు. జయంతి సందర్భంగా స్థానికంగా ఉన్న వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.వేడుకల్లో భాగంగా జానపద కళాకారులు అంబేద్కర్ ఆశయాన్ని,గొప్పతనాన్ని వర్ణిస్తూ గీతాలు ఆలపించారు.ఈ వేడుకల్లో ఎస్వోటు జి.ఎం బి.వి.సత్య నారాయణ,గుర్తింపు ప్రాతి నిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్రరెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఎస్సీ లైజన్ ఆఫీసర్ జి.మహేష్,ఎస్.టి.లైజన్ ఆఫీసర్ ఎల్.వినాయక్, ఓబిసి సంఘాల నాయకుడు తుమ్మ మధుసూదన్,ఎస్.సి, ఎస్.టి ఉద్యోగ సంఘాల ప్రతినిధులు బత్తుల శంకర్,బాలంకూస్,భుక్య కిషన్ నాయక్, మలోత్ రమేష్,ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రాజశేఖర్,సివిల్ డి.జి.యం రాజేంద్ర కుమార్,అధికారులు ఐలయ్య,చంద్ర శేఖర్, ఉదయ్ భాస్కర్, షబ్బీరుద్దీన్,సునీల్ ప్రసాద్,రాజేశం,సేవా కార్యదర్శి ఉమాదేవి, వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, ఉద్యోగులు,సేవా సభ్యులు,కాలనీ వాసులు పాల్గొన్నారు.



## జనకాపూర్‌లో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా



**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్** ఆసిఫాబాద్ పట్టణంలోని జనకాపూర్‌లో మంగళవారం డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, నియోజకవర్గం ఇంచార్జ్ అజ్మీర శ్యామ్ నాయక్, ఇతర నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ అంబేద్కర్ చూపిన సమానత్వం, సామాజిక న్యాయం మార్గంలోనే దేశం ముందుకు సాగాలని పేర్కొన్నారు. బలహీన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు.కార్యక్రమంలో భాగంగా సహపంక్తి భోజనం నిర్వహించి అన్ని వర్గాల ప్రజలు కలిసి భోజనం చేయడం ద్వారా సమానత్వ సందేశాన్ని చాటారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## దేశం గర్వించదగ్గ మేధావి అంబేడ్కర్

### : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజా వాయిస్, నిర్మల్** భారత రాజ్యాంగ రూపకర్త, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పిలుపునిచ్చారు. మంగళవారం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని నిర్మల్ పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు పంచశీల జెండాను ఆవిష్కరించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అంబేద్కర్ ప్రపంచం గర్వించదగ్గ గొప్ప మేధావి అని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాలు వివక్షకు గురవుతున్న కాలంలో, సమసమాజ స్థాపనే లక్ష్యంగా ఆయన అహర్నిశలు శ్రమించారని గుర్తుచేశారు. చిన్నతనం నుంచే ఎన్నో కష్టాలను ఎదుర్కొని, ఉన్నత విద్యను అభ్యసించి, దేశానికి పటిష్టమైన రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడని ప్రశంసించారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ, సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని సూచించారు.అనంతరం జయంతి వేడుకల్లో భాగంగా ప్రత్యేకంగా 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా కలెక్టర్ అధికారులతో కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, 1 అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఎస్సీ సంక్షేమ శాఖాధికారి దయానంద్, సీపీఓ జీవరత్నం, డి ఈ ఓ భోజన్న, వివిధ సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తపస్ అధ్వర్యంలో ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవం

- సమాజం'లో ప్రతి పౌరుడు హక్కులతో పాటు బాధ్యతాయుతంగా జీవించాలి
- వాంకుడోతు జ్యోతి.తపస్ ములుగు జిల్లా అధ్యక్షురాలు.

**ప్రజా వాయిస్; ములుగు జిల్లా./** తపస్ ములుగు జిల్లా అధ్యక్షురాలు వాంకుడోత్ జ్యోతి అధ్యక్షతన జిల్లా కేంద్రంలో ఘనంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఏర్పాటు చేసుకోవడం జరిగింది. టి పి యు ఎస్ ములుగు జిల్లా అధ్యక్షురాలు వాంకుడోత్ జ్యోతి మాట్లాడుతూ.....అంబేద్కర్ భారతదేశంలోని అన్ని వర్గాల ప్రయోజనాల కోసం రాజ్యాంగాన్ని రూపొందించారని అన్నారు. అస్పృశ్యత, అంటరానితనం వెనుకబాటుతనం, రాజకీయ సామాజిక, అసమానతలను రూపుమాపే అంతవరకు రిజర్వేషన్లు అమలు జరగాలని, అందరికీ సమాన అవకాశాలు రాజ్యాంగం ద్వారా కల్పించబడాలని అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాణం చేశారని అన్నారు. భారతదేశంలోని ప్రతి పౌరుడు హక్కుల'తో పాటు బాధ్యతయుతంగా జీవించాలని చెప్పారని అన్నారు. భారతదేశం యొక్క సంస్కృతి, సమగ్రత, ఐక్యత కాపాడుతూ సోదరి, సోదర భావంతో జీవించాలని చెప్పారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన గోన విజేందర్, కార్యదర్శి టిపియూఎస్ రాష్ట్ర బాధ్యులు పద్మాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోనె రవీందర్, ఉపాధ్యక్షులు బాణాల సుధాకర్, గొల్ల కుమార్, కార్యవర్గ సభ్యులుకొత్త పెల్లి పోషన్న, భద్రు నాయక్, ఒల్లాల రాజేందర్, ఉపాధ్యాయులు అశోక్, వేణు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.



## అంబేద్కర్ ఆశయ స్ఫూర్తితో యువత ఉద్యమించాలి

- లాల్ జెండా-నీల్ జెండా ఏకమై ఎర్రకోటపై ఎగరాలి
- అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష-కార్య దర్శులు దుర్గం లక్ష్మి, కామెర పద్మ




**ప్రజా వాయిస్ / కన్నెపల్లి** కన్నెపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో రాజ్యాంగ నిర్మాత, దళితుల ఆశాజ్యోతి, ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతిని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు దుర్గం లక్ష్మి, కార్యదర్శి కామెర పద్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం దుర్గం లక్ష్మి మాట్లాడుతూ అంబేద్కర్ తన జీవితాన్ని దళితుల అభ్యున్నతి కోసం, మనుధర్మాన్ని తుదముట్టించేందుకు, సమాజంలో దళితులు గౌరవంగా జీవించేలా చేయడానికి అంకితం చేశారని తెలిపారు. దళితులు విద్యా, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో ఎదగేందుకు రాజ్యాంగంలో అనేక హక్కులు పొందుపరిచారని, అగ్రవర్ణాల అణచివేతపై పోరాడి గుడిమెట్లు, బడిమెట్లు ఎక్కే మార్గం చూపారని అన్నారు. మనిషిని మనిషిగా చూడని మనుధర్మ శాస్త్రాన్ని మంటల్లో కలిపి, బహుజన రాజ్యం రావాలని కలలు కన్న మహనీయుడు అంబేద్కర్ అని పేర్కొన్నారు. ఈ దేశంలో అంటరానితనం నిర్మూలన కోసం అహర్నిశలు కృషి చేసిన అంబేద్కర్ ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమించాలని పిలుపునిచ్చారు. లాల్ జెండా, నీల్ జెండా ఏకమై మార్క్సిజం–అంబేద్కర్ ఆలోచనా విధానాలను అమలు చేస్తూ ఎర్రకోటపై ఎగరాలని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యు) పార్టీ నాయకులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# జడ్చర్లలో ఘనంగా 135వ అంబేద్కర్ జయంతి వేడుకలు

- అంబేద్కర్ ఆశయాల సాధన ప్రతి ఒక్కరి బాధ్యత
- ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి
- విద్య, వైద్యం అభివృద్ధితో సమానత్వ సమాజం లక్ష్యం
- రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని ప్రతిభకు ఎమ్మెల్యే అభినందనలు




**జడ్చర్ల, ప్రజా వాయిస్** జడ్చర్ల మున్సిపాలిటీలోని పాత బజార్, సిగ్నల్ గడ్డ ప్రాంతంలో నిర్వహించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాలలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సేవలు దేశానికి అపారమని కొనియాడారు. సమానత్వం, సామాజిక న్యాయం, స్వేచ్ఛ వంటి మహత్తర విలువలను ఆయన జీవితాంతం ఆచరించి ప్రజలకు మార్గదర్శకుడిగా నిలిచారని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాల సాధన ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు.జడ్చర్ల నియోజక వర్గ అభివృద్ధిని అంబేద్కర్ చూపిన మార్గంలో ముందుకు తీసుకెళ్తున్నామని, ప్రతి వర్గ ప్రజలకు న్యాయం చేసే విధంగా కృషి కొనసాగుతున్నదని తెలిపారు. విద్యా, వైద్య రంగాలలో పురోగతికి కట్టుబడి పనిచేస్తున్నామని, అందులో భాగంగా ట్రిబుల్ ఐటీ కళాశాల, యంగ్ ఇంటిగ్రేటెడ్ స్కూల్, నవోదయ పాఠశాల మంజూరు చేయించడం జరిగిందని గుర్తుచేశారు. గత సంవత్సరం ట్రిబుల్ ఐటీకి జడ్చర్ల నియోజకవర్గం నుండి 14 మంది విద్యార్థులు ఎంపిక కావడం గర్వ కారణమని అన్నారు.అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరూ కుల, మత భేదాలు లేకుండా స్వేచ్ఛ, మానవత్వంతో జీవించాలని సూచించారు. అంబేద్కర్ కల్పించిన స్వేచ్ఛ హక్కు ద్వారానే ప్రజల సమస్యలపై స్వేచ్ఛగా మాట్లాడటం తన బాధ్యతగా భావిస్తున్నానని, అసెంబ్లీలో ఇప్ప సార పై తన స్వరం వినిపించగా అనేక మంది ఎమ్మెల్యేలు మద్దతు తెలిపారని తెలిపారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలలో జడ్చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి(జయభ ఫిర్దూస్) MPC విభాగంలో 1000లో 991 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ఫస్ట్ ర్యాంక్ సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థిని సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



## బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ జయంతి

**ప్రజా వాయిస్ బెల్లంపల్లి** ప్రపంచ మేధావి, దళితవర్గాల ఆరాధ్య దైవం, నవభారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి 135 వ జయంతి వేడుకలలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జడ్పీటీసీ ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది కొయ్యల ఏమాజి, బిజెపి పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ కంటెస్టెంట్ గోమాసే శ్రీనివాస్ తాండూరు మండలం, మంచిర్యాల పట్టణం, గోదావరిఖని, తదితర ప్రాంతాల్లో పాల్గొని అంబేద్కర్ గారికి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి తాండూరు మండలం అధ్యక్షులు భరత్ కుమార్, జిల్లా కార్యదర్శి మహేందర్ గౌడ్, సీనియర్ నాయకులు కేశవరెడ్డి, పులగం తిరుపతి , శ్రీకృష్ణ దేవరాయలు, తుకారాం, గోవర్ధన్ , రామన్న యాదవ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రావణ్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, నర్సింగ్, సిద్ధం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## శిల్గాపూర్ గ్రామంలో ఘనంగా డా. బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలు



**ప్రజా వాయిస్,తిరుమలగిరిసాగర్,** తిరుమలగిరిసాగర్ మండలం శిల్గాపూర్ గ్రామంలో డా. బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కమ్మంపాటి శ్రీను అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా A.K ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది కట్టెబోయిన అనిల్ కుమార్ హాజరై అనంతరం వారు అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు అర్పించి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ, మహనీయుడు డా. బాబా సాహెబ్ అంబేద్కర్ చేసిన త్యాగాల ఫలితంగా మనమందరం ఈ రోజు అనుభవిస్తున్న హక్కులు, స్వేచ్ఛలు లభించాయని పేర్కొన్నారు. దళిత బహుజన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ, మాజీ సర్పంచ్ తుడం రమణ–ముత్తయ్య, వార్డు సభ్యులు కమ్మంపాటి పుల్లయ్య, తాదూరి రాజయ్య, వెంకన్న, చిమట వెంకన్న యాదవ్, ఎరుకల లలిత, డీలర్ నరసింహ, బొడ్డుపల్లి నరసింహ చారి, కొర్రపిడత మల్లయ్య యాదవ్, వల్లందాస్ సైదులు గౌడ్, బుర్రి వెంకన్న యాదవ్, ఎర్ర సముద్రం చైర్మన్ చింతకాయల శ్రీను, హెల్పర్ వెంకటయ్య, మౌలానా, డేవిడ్ రాజు, బొమ్మపాల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు. మహిళలు, గ్రామ పెద్దలు, చిన్నారులు మరియు యువత కూడా పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా గ్రామంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడగా, పాల్గొన్న వారందరూ అంబేద్కర్ ఆశయాలను పాటించేందుకు సంకల్పం వ్యక్తం చేశారు.

## అంబేద్కర్ జయంతిని సందర్భంగా చలివేంద్రం ఏర్పాటు

- యువ నాయకుడు క్యాతం మధు కృష్ణ



**శామీర్ పేట / ప్రజా వాయిస్ :** మూడుచింతలపల్లి మున్సిపాలిటీ లక్ష్మాపూర్ గ్రామములో రాజ్యాంగ నిర్మాత, న్యాయవాది, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బిఆర్ అంబెద్కర్ 135వ జయంతి వేడుకలు బి జె ఆర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యములో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మున్సిపాలిటీ యువనాయకుడు క్యాతం మధు క్రిష్ణ, ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని, ప్రజల దాహార్తి తీర్చడానికి రింగురోడ్డు వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్మెన్ జాము రవి, స్థానిక కౌన్సిలర్లు శ్రీవాణి, సరిత, దాత మధు క్రిష్ణ తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బి జె ఆర్ యూత్ సభ్యులు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్ సింగం ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ నాగరాజు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బండి జగన్నాథం, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు గోపి, నాయకులు మర్యాల వీరేశం, వైద్యనాథ్, బండి రవి, నర్సింగ్ రావు, లక్ష్మణ్, చారి, సురేష్, ఎల్లం, నరేష్, గోపాల్, నర్సిములు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాపన్నపేటలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ



**ప్రజా వాయిస్, పాపన్నపేట** పాపన్నపేటలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ను ఆదర్శప్రాయుడుగా పేర్కొన్నారు. అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనకు ఆయన చేసిన కృషిని అపారమని అన్నారు, రాజ్యాంగ శిల్పిగా అన్ని వర్గాల ప్రజల కు సమాన హక్కుల కల్పించడం వల్లే నేడు ప్రజలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట సర్పంచ్ పావని నరేందర్ గౌడ్, మరియు యువ క్రాంతి యువజన సంఘం నాయకులు, యువత తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఘనంగా అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు

- అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**ప్రజా వాయిస్, కొత్తగూడెం** భారత రాజ్యాంగ నిర్మాత, దళిత హక్కులకు మార్గదర్శకుడు డా. బాబా సాహెబ్ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డా. అంబేద్కర్ చిత్రపటానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ చిన్ననాటి నుంచే కులవ్యవస్థను ఎదుర్కొంటూనే ఉన్నత విద్యను అభ్యసించి న్యాయవాదిగా, ఆర్థిక శాస్త్రవేత్తగా, రాజకీయ నేతగా, సంఘ సంస్కర్తగా అంబేద్కర్ ఎదిగారని తెలిపారు. అంటరానితనం, కుల నిర్మూలన కోసం ఆయన చేసిన కృషి అనన్య సాధారణమని అన్నారు. విదేశాల్లో విద్యను అభ్యసించి ప్రపంచ దేశాలు ఆశ్చర్యపడేలా భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. స్వాతంత్ర్య భారతదేశ తొలి కేంద్ర న్యాయశాఖ మంత్రిగా, బలహీన వర్గాలకు ఆశాజ్యోతిగా నిలిచిన అంబేద్కర్ నేటి యువతకు ఆదర్శప్రాయుడని కొనియాడారు. డా. బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు.






## ఘనంగా అంబేద్కర్ జయంతి మహోత్సవం

- కోట్ పల్లి లో చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ బసమ్మ సంగయ్య
- జైభీమ్ నినాదాలతో గ్రామాలలో భారీ ర్యాలీలు

**ప్రజావాయిస్/కోట్ పల్లి:** మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో దళిత సంఘాల ఆధ్వర్యంలో 135వ అంబేద్కర్ జయంతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకొని ఆయన బాటలో నడవడం ఎంతో గొప్ప విశేషం అని కొనియాడారు. ఈ సందర్భంగా అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని కోటపల్లి మండల కేంద్ర సర్పంచ్ దళిత సంఘాలతో కలిసి చలివేంద్రాన్ని ప్రారంభించారు, కోటపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో సర్పంచ్ డాక నీలమ్మ మహేశ్వర్ రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలతో జయంతి మహోత్సవాన్ని ప్రారంభించారు. కరీంపూర్ ఎంకేపల్లి, ఎన్నారం కొత్తపల్లి, మోత్కుపల్లి, బార్వాద్, నాగ్సన్పల్లి, తదితర గ్రామాల్లో భారీ ఎత్తున యువకులు జై భీమ్ నినాదాలతో ప్రధాన వీధుల గుండా ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచ్లతో పాటు దళిత సంఘాల నాయకులు పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్రంపోడు మండలంలోని పలు గ్రామాల్లో అంబేద్కర్ జయంతి ఘనంగా

- అంబేద్కర్ ఆశయాలతో మార్మోగిన ప్రజల జయజయ ధ్వానాలు

ప్రజా వాయిస్: గుర్రంపోడు మండలం,నల్గొండ జిల్లా, గుర్రంపోడు మండలం భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా గుర్రంపోడు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. గ్రామాలన్నీ ఉత్సాహభరిత వాతావరణంలో మునిగిపోయి, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. యువత, మహిళలు, గ్రామ పెద్దలు కలిసి జయజయధ్వానాలతో కార్యక్రమాలను విజయవంతం చేశారు. నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ చూపిన సమానత్వం, సామాజిక న్యాయం మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని తెలిపారు.1891లో జన్మించిన డా. అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రూపుదిద్దిన మహానుభావుడిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు. విద్య, సమాన హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం నేటికీ ప్రేరణగా నిలుస్తోందని కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, యువత కొనియాడారు.



## రాజ్యాంగబద్ధమైన హక్కుల సాధనతోనే సామాజిక విముక్తి సాధ్యం


- గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రమావత్ దినేష్ నాయక్...!



**నల్లగొండ:**భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి 135వ జయంతి వేడుకలలో గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రమావత్ దినేష్ నాయక్ మంగళవారం నల్గొండ డీఈఓ ఆఫీస్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం దగ్గర జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమావత్ దినేష్ నాయక్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతి, రాజ్యాంగ హక్కులపై ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రమావత్ దినేష్ నాయక్ మాట్లాడుతూ... అంబేద్కర్ అందించిన రాజ్యాంగ ఫలాలు క్షేత్రస్థాయిలో ఉన్న ప్రతి సామాన్యుడికి చేరినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల ప్రజలకు అందేలా చూడాలన్నారు. "చదువు అనేది కేవలం ఉద్యోగం కోసం కాదు, అది బానిస సంకెళ్లను తెంచే ఆయుధం. నేడు విద్య, వైద్యం సామాన్యుడికి భారంగా మారాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి పౌరుడికి నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందేలా చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత," అని ఆయన డిమాండ్ చేశారు.ఆర్థిక అసమానతలు ఉన్నంత కాలం సామాజిక వివక్ష కొనసాగుతూనే ఉంటుందని, అణగారిన వర్గాలు ఆర్థికంగా ఎదిగి, పారిశ్రామిక వేత్తలుగా మారినప్పుడే అంటరానితనానికి అసలైన పరిష్కారం లభిస్తుందని అన్నారు. అదేవిధంగా... ఓటు హక్కు ద్వారా సామాన్యుడు పాలకుడిగా మారే గొప్ప అవకాశాన్ని అంబేద్కర్ గారు కల్పించారని, ఈ రాజాధికారమే అన్ని సామాజిక సమస్యలకు 'మాస్టర్ కీ' లాంటిదని గుర్తు చేశారు. గిరిజన సంస్కృతి – అస్తిత్వ పరిరక్షణ కార్యక్రమంలో గిరిజన అస్తిత్వంపై ప్రత్యేక చర్చ జరిగింది. గిరిజన సంస్కృతి ప్రకృతితో మమేకమైన అత్యున్నత జీవన విధానమని, రాజ్యాంగంలోని 5వ మరియు 6వ షెడ్యూల్స్ ప్రకారం గిరిజనుల జల, జంగిల్, జమీన్ హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## ఏకిన్‌పూర్‌లో ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు

- నివాళులర్పించిన జువ్వాడి కృష్ణారావు, మున్సిపల్ చైర్ పర్సన్, వార్డు కౌన్సిలర్ రాజ్యాంగ నిర్మాత ఆశయాలను కొనసాగించాలి



**ప్రజా వాయిస్, కోరుట్ల:** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు పిలుపునిచ్చారు. కోరుట్ల పట్టణంలోని 6వ వార్డు ఏకిన్‌పూర్‌లో అంబేడ్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహానికి ముఖ్య అతిథులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ.. దేశ గమనాన్ని మార్చిన మహనీయుడు అంబేడ్కర్ అని, ఆయన రచించిన రాజ్యాంగం వల్లే నేడు సమాజంలో అట్టడుగు వర్గాలకు సమాన హక్కులు లభిస్తున్నాయని కొనియాడారు. ఆయన ఆలోచన విధానం, దూరదృష్టి నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ కేవలం ఒక వర్గానికి చెందిన వారు కాదని, దేశ ప్రజలందరికీ స్ఫూర్తిప్రదాత అని అన్నారు. యువత ఆయన అడుగుజాడల్లో నడిచి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అనంతరం వార్డు కౌన్సిలర్ శిరీష శేఖర్, మున్సిపల్ కమిషనర్ రవీందర్ కూడా అంబేడ్కర్ సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అంబేడ్కర్ యువజన సంఘాల ప్రతినిధులు, వార్డు ప్రజలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జయంతి వేడుకల సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

### సర్పంచ్ ఎలికట్టి భరత్



ప్రజా వాయిస్ వేములపల్లిఅంబేద్కర్ అందరివాడు.. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలి అని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని, ఆయన ఆశయసాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని లక్ష్మీదేవి గుడం సర్పంచ్ ఎలికట్టి భరత్ అన్నారు. మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో మరియు జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135 వజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎలికట్టి భరత్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం భారత రాజ్యాంగాన్ని రూపకల్పన చేసి అందరికి సమాన హక్కులు కల్పించిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని కీర్తించారు.